RNI. No: TELTEL/2023/88215

# తెలంగాణ దిశ

TELANGANA DISHA TELUGU DAILY తెలుగు దినపత్రిక

మల్కాజ్‌గిరి MALKAJGIRI | సంపుటి : 3 VOLUME : 3 | సంచిక : 191 ISSUE NO : 191 | ఎడిటర్ : మెరుగు చంద్రమోహన్ EDITOR : MERUGU CHANDRAMOHAN | గురువారం, జనవరి 22, 2026 Thursday, January, 22 , 2026 | పేజీలు : 8 వెల : రూ.4/- PAGES : 8 RS : 4 /-



## దావోస్‌లో రేవంత్ రెడ్డితో చిరంజీవి

- పెట్టుబడులను ఆకర్షించడమే లక్ష్యంగా దావోస్‌కు వెళ్లిన రేవంత్ రెడ్డి
- జ్యూరిక్ లో చిరంజీవి ఉన్నట్టు తెలుసుకున్న రేవంత్
- దావోస్‌కు రావాలంటూ చిరంజీవికి ఆహ్వానం
- రేవంత్ ఆహ్వానం మేరకు దావోస్ వెళ్లిన మెగాస్టార్

**హైదరాబాద్,తెలంగాణ దిశ :**స్విట్జర్లాండ్లోని దావోస్‌లో జరుగుతున్న ప్రపంచ ఆర్థిక సదస్సులో తెలంగాణ రాష్ట్రానికి పెట్టుబడులను ఆకర్షించడమే ప్రధాన లక్ష్యంగా రేవంత్ ప్రభుత్వం కృషి చేస్తోంది. ఈ సదస్సుకు సీఎం రేవంత్ రెడ్డి, మంత్రులు శ్రీధర్ బాబు, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, కీలక అధికారులు హాజరయ్యారు. సదస్సులో మెగాస్టార్ చిరంజీవి కూడా పాల్గొన్నారు. స్విట్జర్లాండ్ లోని జ్యూరిక్ లో చిరంజీవి ఉన్నట్టు తెలుసుకున్న రేవంత్ రెడ్డి... సదస్సుకు ఆయనను ఆహ్వానించారు. రేవంత్ ఆహ్వానం మేరకు దావోస్ సదస్సుకు చిరంజీవి వెళ్లారు. ఈ సందర్భంగా, తెలంగాణ ప్రభుత్వం ఆవిష్కరించిన "తెలంగాణ రైజింగ్ 2047" విజన్ డాక్యుమెంట్‌ను చిరంజీవి ఆసక్తిగా వీక్షించారు. ఈ సందర్భంగా చిరంజీవితో రేవంత్ ముచ్చటిస్తూ... ఇటీవల కుటుంబంతో కలిసి 'మన శంకర వరప్రసాద్ గారు' సినిమాను చూశానని, సినిమా చాలా బాగుందని తెలిపారు. చిరంజీవికి అభినందనలు తెలియజేశారు. ప్రస్తుతం చిరంజీవి స్విట్జర్లాండ్‌లో ఫ్యామిలీ ట్రిప్‌ను ఎంజాయ్ చేస్తున్నారు.



## తెలంగాణకు పెట్టుబడుల.. వెల్లువ

వరంగల్, ఆదిలాబాద్ విషయంలో సీఎం కీలక ప్రకటన

**హైదరాబాద్,తెలంగాణ దిశ :** దావోస్ వేదికగా జరుగుతున్న ప్రపంచ ఆర్థిక సదస్సులో తెలంగాణ రాష్ట్రానికి పెట్టుబడుల ప్రవాహం కొనసాగుతోంది. బుధవారం ఆయా రంగాల్లో పలు దిగ్గజ పారిశ్రామిక సంస్థలు పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు ముందుకు వచ్చాయి. ఎంవోయూలు చేసుకున్న కార్యక్రమాలలో సీఎం రేవంత్ రెడ్డి స్వయంగా పాల్గొంటున్నారు. ప్రపంచంలోనే తొలి బ్యూటీ-టెక్ గ్లోబల్ కెపాబిలిటీ సెంటర్ ను హైదరాబాద్ లో ఏర్పాటు చేస్తున్నట్లు లోరియల్ సంస్థ ప్రకటించింది. ఈ అత్యాధునిక కేంద్రాన్ని ఈ ఏడాది నవంబర్ లో ప్రారంభించనున్నట్లు ప్రకటించింది. ఈ మేరకు ఇవాళ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి లోరియల్ సీఈవో నికోలస్ హియెరోనిమస్ తో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా జరిగిన చర్చల్లో హైదరాబాద్‌లో భారీ పెట్టుబడులతో బ్యూటీ-టెక్ జీసీసీ ఏర్పాటు చేసే నిర్ణయాన్ని వెల్లడించారు. ఈ జీసీసీ ఏర్పాటుతో లోరియల్‌కు గ్లోబల్ ఇన్నోవేషన్, టెక్నాలజీ, డేటా, సప్లై చైన్ కార్యకలాపాలకు హైదరాబాద్ కీలక కేంద్రంగా నిలవనుంది. డిజిటల్ ట్రాన్స్‌ఫర్మేషన్, ఏఐ, అనలిటిక్స్ రంగాల్లో రూపొందించే సాంకేతిక పరిష్కారాలను ప్రపంచవ్యాప్తంగా ఉన్న లోరియల్ యూనిట్లకు అందిస్తామని హియెరోనిమస్ తెలిపారు. దీంతో గ్లోబల్ ఎంటర్‌ప్రైజ్ కార్యకలాపాలకు హైదరాబాద్ ప్రాముఖ్యత మరింత పెరుగనుంది. తెలంగాణతో బ్లైజ్ ఒప్పందం: తెలంగాణ ప్రభుత్వం దావోస్‌లో కాలిఫోర్నియాకు చెందిన బ్లైజ్ సంస్థతో అవగాహన ఒప్పందం (ఎంవోయూ) కుదుర్చుకుంది.





## ఎయిర్‌ఫోర్స్ వన్ విమానంలో.. సాంకేతిక లోపం

### మరో విమానంలో దావస్‌కు డోనాల్డ్ ట్రంప్

వాషింగ్టన్: అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ ప్రయాణించే ఎయిర్ ఫోర్స్ వన్ విమానంలో అకస్మాత్తుగా సాంకేతిక లోపం తలెత్తింది. దీంతో ఆయన ప్రయాణించే విమానం వాషింగ్టన్‌లోని జాయింట్ బేస్ ఆండ్రూస్‌కు తిరిగి వచ్చేసింది. స్విట్జర్లాండ్‌లోని దావస్‌లో జరుగుతున్న వరల్డ్ ఎకనామిక్ ఫోరమ్ మీటింగ్‌కు ఆయన వెళ్లేందుకు ఎయిర్ ఫోర్స్ విమానంలో బయలుదేరారు. అయితే టేకాఫ్ తీసుకున్న కొన్ని క్షణాల తర్వాత ట్రంప్ ప్రయాణిస్తున్న ఎయిర్ ఫోర్స్ విమానంలో సాంకేతిక సమస్య తలెత్తింది.





## అలంపూర్ ఎమ్మెల్యేపై దాడి గర్హనీయం

- ఎంపి మల్లు రవి తక్షణం క్షమాపణలు చెప్పాలి
- మాజీమంత్రులు హరీష్ రావు, కెటిఆర్‌ల డిమాండ్

**హైదరాబాద్,తెలంగాణ దిశ :** అలంపూర్ బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే విజయుడిపై కాంగ్రెస్‌సీనియర్ నేత, నాగర్‌కర్నూల్ ఎంపీ మల్లు రవి దాడిని మాజీ మంత్రులు హరీశ్‌రావు, కెటిఆర్‌లు తీవ్రంగా ఖండించారు. విజయుడిపై కాంగ్రెస్ ఎంపీ మల్లు రవి దుర్భాషలాడుతూ చేయి చేసుకోవడం దారుణం, అప్రజాస్వామికమని వారు విమర్శించారు. ప్రజల చేత ఎన్నికయిన ప్రతినిధిపై దాడి అంటేప్రజల తీర్పుపైనే దాడి అని స్పష్టం చేశారు. విజయుడిపై ఎంపీ మల్లు రవి దాడిని బీఆర్‌ఎస్ పార్టీ తీవ్రంగా ఖండిస్తోందని తెలిపారు.



## ఒకేరోజు ముగ్గురు రైతుల ఆత్మహత్య

- తెలంగాణ దుర్భర పరిస్థితులకు నిదర్శనం
- ప్రభుత్వ తీరుపై మండిపడ్డ బిఆర్‌ఎస్ నేత కెటిఆర్
- రైతులకు 25 లక్షల చొప్పున ఎక్స్‌గ్రేషియా డిమాండ్

**హైదరాబాద్,తెలంగాణ దిశ :**తెలంగాణలో ఒకే రోజు ముగ్గురు అన్నదాతలు ఆత్మహత్య చేసుకోవడం అత్యంత ఆందోళనకరమని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆవేదన వ్యక్తం చేశారు. సమైక్యరాష్ట్రంనాటి సంక్షోభ పరిస్థితులు తెలంగాణవ్యాప్తంగా నెలకొని ఉన్నాయన డానికి వేర్వేరు ప్రాంతాల్లో జరిగిన ఈ ఘటనలే నిదర్శనమని అన్నారు. ఆదిలాబాద్, మెదక్, జయశంకర్ భూపాలపల్లి జిల్లాల్లో ముగ్గురు రైతుల నిండు ప్రాణాలను పొట్టన పెట్టుకున్న పాపం ముమ్మాటికీ ఈ చేతకాని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిదే అని మండిపడ్డారు. భూపాలపల్లిలో కోడెల సదానందం, మెదక్ లో దేవ్‌సోత్ సర్వేశ్, ఆదిలాబాద్ లో జాదవ్ అంకుష్ కుటుంబాలకు ప్రభుత్వం వెంటనే 25 లక్షల ఎక్స్ గ్రేషియా చెల్లించి ఆదుకోవాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. ఈ ముగ్గురు రైతుల ఆత్మహత్యలకు అప్పులే ప్రధాన కారణం కావడం, రేవంత్ సర్కారు మోసాలను, అబద్ధపు హామీల పేరిట చేసిన తీరని ద్రోహాన్ని అడుగడుగునా ఎత్తిచూపుతోందని అన్నారు. రుణమాఫీ పేరిట చేసిన నయవంచనకు తోడు, పెట్టుబడి సాయానికి పాతరేయడం, చివరికి యూరియాను కూడా ఎగ్గొట్టి దిగుబడిని దెబ్బతీయడంతో కాంగ్రెస్ పాలనలో తెలంగాణ అన్నదాత పరిస్థితి అనాథలా మారిందని అన్నారు.



## కాలం కలసి వస్తే.. అన్నే సీఎం

### డికే శివకుమార్ తమ్ముడు సురేశ్ వ్యాఖ్య

బెంగళూరు, జనవరి21 : అధికారం శాశ్వతం కాదు, అంతకుమించి ఓపిక కూడా శాశ్వతమని చెప్పలేమని తలరాత రాసి ఉంటే మా అన్న డీకే శివకుమార్ సీఎం అవుతాడని మాజీ ఎంపీ డీకే సురేశ్ అన్నారు. సదాశివనగర్‌లోని నివాసం వద్ద ఆయన మీడియాతో మాట్లాడారు. సరైన సమయంలో తగిన నిర్ణయం తీసుకుంటామని అగ్రనేత రాహుల్‌గాంధీ సూచించారన్నారు. ఎమ్మెల్యేలను దృష్టిలో ఉంచుకుని వేచిచూస్తున్నామన్నారు. రాజకీయాలే కాదు ఏ రంగంలోనైనా ఉన్నతస్థానం అంత సులువుగా దక్కదు.ముఖ్యమంత్రి పదవి మా అన్నకు అంత సులువుగా లభించనుందని చెప్పలేం.




## పాలమూరు జిల్లాలో వేడెక్కిన మున్సిపల్ పోరు

- రిజర్వేషన్ల ఖరారుతో రంగంలోకి ఆశావహులు
- సిఎం సొంత జిల్లా కావడంతో ప్రత్యేక దృష్టి
- అన్ని పార్టీల్లోనూ గెలుపుపై ఆశాభావం

**మహబూబ్‌నగర్,తెలంగాణ దిశ :** ఉమ్మడి పాలమూరు జిల్లాపై ఇప్పుడు అందరి దృష్టి పడింది. సిఎం సొంత జిల్లా కావడంతో పాటు, ఇప్పుడు ఇక్కడ అనేక అభివృద్ధి కార్యక్రమాలకు రేవంత్ రెడ్డి శ్రీకారం చుట్టారు. తచూ జిల్లాలో ఏదో ఒక పనిమీద పరుగులు పెడుతున్నారు. దీంతో ఈ ఉమ్మడి జిల్లా మున్సిపాలిటీలపై ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తున్నారు. మహబూబ్‌నగర్ పార్లమెంట్ నియోజకవర్గంలో ఏడు మున్సిపాలిటీలు ఉండగా.. జడ్చర్ల పాలకవర్గం పదవీ కాలం ఇంకా పూర్తి కాలేదు. మహబూబ్‌నగర్, నారాయణపేట జిల్లాల్లోని భూత్పూర్, దేవరకద్ర, కోస్గి, మద్దూరు, మక్తల్, నారాయణపేట మున్సిపాలిటీలు, మహబూబ్‌నగర్ కార్పొరేషన్‌కు ఎన్నికలు జరగనున్నాయి. ఈక్రమంలో కాంగ్రెస్ హైకమాండ్ గెలుపు బాధ్యతలను జిల్లా ఇన్‌చార్జి మంత్రిగా వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహకు అప్పగించింది. మంత్రి దామోదరకు మహబూబ్‌నగర్ పార్లమెంట్ బాధ్యతలను అప్పగించింది. ముందుగా ఆయా మున్సిపాలిటీలు, కార్పొరేషన్ పరిధిలోని లీడర్లతో సమావేశం కానున్నారు.



## మున్సిపల్ ఎన్నికల బరిలో కవిత

**హైదరాబాద్,తెలంగాణ దిశ :** బీఆర్‌ఎస్ నుంచి బయటకు వచ్చిన కల్వకుంట్ల కవిత.. కొత్త పార్టీ ఏర్పాటు దిశగా కసరత్తు ముమ్మరం చేస్తున్నారని వార్తలు వస్తున్నాయి. ఈ నేపథ్యంలో రాజకీయ వ్యూహకర్త ప్రశాంత్ కిశోర్‌తో వరుస సమావేశాలు నిర్వహిస్తున్నారని ప్రచారం జరిగిం ది. త్వరలోనే కొత్త రాజకీయ పార్టీ ప్రకటించే అవకాశం ఉందని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ఈ క్రమంలో త్వరలో జరగబోయే మున్సిపల్ ఎన్నికల్లో.. తెలంగాణ జాగృతి నేతలు బరిలోకి దిగే అవకాశం ఉందని.. ఈ మేరకు కవిత కసరత్తు చేస్తున్నారని వార్తలు వస్తున్నాయి. బీఆర్‌ఎస్ నుంచి బయటకు వచ్చిన కల్వకుంట్ల కవిత.. కొత్త పార్టీ ఏర్పాటు దిశగా కసరత్తు ముమ్మరం చేస్తున్నారని వార్తలు వస్తున్నాయి.

# అధికారులు సమన్వయంతో పనిచేసి కీసర బ్రహ్మోత్సవాలను విజయవంతం చేయాలి




## - జిల్లా కలెక్టర్ మిక్కిలినేని మను చౌదరి...

**మేడ్చల్ జిల్లా ప్రతినిధి, జనవరి 21, (తెలంగాణ దిశ):** కీసర రామలింగేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలకు అధికారులందరూ సమన్వయంతో పని చేసి భక్తులకు ఎక్కడ ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ మిక్కిలినేని మను చౌదరి అన్నారు. బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో కీసర రామలింగేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలపై మల్కాజిగిరి జోనల్ కమీషనర్ సంచిత్ గంగువార్, జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డి, కుషాయిగూడ ఏసిపి వెంకట్ రెడ్డి, ఆర్డీఓ రాజేష్, ఆలయ కమిటీ చైర్మన్ తటాకం వెంకటేశ్, ఆలయ ఈవో సుధాకర్ రెడ్డిలతో కలిసి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఫిబ్రవరి 15న మహాశివరాత్రి పండుగను పురస్కరించుకొని ఫిబ్రవరి 13వ తేదీ నుంచి 18వ తేదీ వరకు కీసర రామలింగేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు నిర్వహించడం జరుగుతుందన్నారు. బ్రహ్మోత్సవాలకు వచ్చే భక్తులకు సౌకర్యవంతంగా ఉండేందుకు క్యూ లైన్ లను పెంచాలన్నారు. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు ఎక్కువగా వచ్చే అవకాశం ఉన్నందున ఆర్టీసీ బస్సులు పెంచాలన్నారు. భద్రతా లోపం తలెత్తకుండా పోలీస్ శాఖ పటిష్ట బందోబస్తు నిర్వహించాలన్నారు. భక్తులకు అత్యవసర చికిత్స కోసం



అవసరమైన వైద్య సిబ్బంది, మందులు అందుబాటులో ఉండాలన్నారు. బారీకేడ్లు, దర్శనం క్యూ లైన్, పార్కింగ్ కు ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని ఆర్ అండ్ బి, జాతరలో భక్తులకు అందుబాటులో అవసరమైన అన్ని చోట్ల త్రాగునీటిని అందుబాటులో ఉంచాలని జలమండలి అధికారులను కోరారు. జాతరలో పరిశుభ్రమైన వాతావరణం ఉండేలా చూడాలని, ఇందుకు సంబంధించి ఎప్పటికప్పుడు శానిటేషన్ చేయాలని, అధికారులు అవసరమైన ప్రత్యేక ఏర్పాట్లు చేయాల్సిందిగా కలెక్టర్ తెలిపారు. జాతర రోజుల్లో ఆలయ పరిసరాల్లో అగ్నిమాపక సిబ్బందితో పాటు ఫైరింజన్ ను అందుబాటులో ఉంచాలని కలెక్టర్ ఆదేశించారు. బ్రహ్మోత్సవాలను అధికారులు, ప్రజాప్రతినిధులు కలిసి విజయవంతం చేయాలని కోరారు. ఈ సమీక్ష సమావేశంలో ఆలయ కమిటీ సభ్యులు, జిల్లా అధికారులు, సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.



# బాచుపల్లిలో 2.30 ఎకరాల పార్కును కాపాడిన హైడ్రా

## - రూ. 300ల కోట్ల విలువైన భూమికి హైడ్రా ఫెన్సింగ్




**కుత్బుల్లాపూర్, జనవరి 21, (తెలంగాణ దిశ)** :బాచుపల్లిలో 2.30 ఎక?రాల ప్ర?భుత్వ భూమిని హైడ్రా కాపాడింది. ఆ ప?క్క?నే ఎమ్మార్వో కార్యాల?యానికి కేటాయించిన 30 గుంట?ల ప్ర?భుత్వ భూమిని కూడా క?బ్జాల చెర నుంచి హైడ్రా విడిపించింది. స?ర్వే నంబ?రు 142, 143, 144లో ఉన్న 2.30 ఎక?రాల ప్ర?భుత్వ భూమిని 2016లో అప్ప?టి జిల్లా క?లెక్ట?ర్ పార్కు కోసం కేటాయించారు. మొక్క?లు నాటి పార్కును అభివృద్ధి చేశారు. అర్బన్ నర్సరీని ఏర్పాటు చేశారు. వందలాది మొక్కలు నాటి ప?చ్చ?ద?నాన్ని పెంచారు. బోర్?వెల్, వాటర్ సంప్, వాచ్?మన్ గది, ఇనుప గేట్లు, ఫెన్సింగ్ ఏర్పాటు చేశారు. 2023లో కొంత? మంది ప్రైవేటు వ్య?క్తులు పార్కులోని మొక్క?ల?ను ధ్వంసం చేసి న?ర్స?రీని తొల?గించారు. త?మ ల్యాండ్?గా చెబుతూ రాత్రికి రాత్రి ప్ర?హ?రీ నిర్మించారు. ప్ర?జావాణిలో వ?చ్చిన ఫిర్యాదు మేర?కు క్షేత్ర?స్థాయిలో సంబంధిత అధికారుల?తో హైడ్రా ప?రిశీలించింది. పార్కు స్థ?లంగానే నిర్ధారించింది. హైడ్రా క?మిష?న?ర్ ఏవీ రంగ?నాథ్ ఆదేశాల మేర?కు మంగ?ళ?వారం ఆక్ర?మ?ణ?ల?ను తొల?గించింది. ఫెన్సింగ్ ఏర్పాటు చేసి ప్ర?భుత్వ భూమిగా పేర్కొంటూ హైడ్రా బోర్డుల?ను ఏర్పాటు చేసింది. అదే స?ర్వే నంబ?ర్ల?లో 30 గుంట?లు ఎమ్మార్వో కార్యాల?యానికి కేటాయించిన స్థ?లం కూడా క?బ్జాల?కు గురైతే.. ఆక్ర?మ?ణ?ల?ను హైడ్రా తొల?గించింది. 30 గుంట?ల ప్ర?భుత్వ భూమి చుట్టూ ఫెన్సింగ్ వేసి హైడ్రా బోర్డులు ఏర్పాటు చేసింది. పార్కు స్థ?లాన్ని కాపాడ?డంతో బాచుప?ల్లి నివాసితులు హైడ్రాకు ధ?న్య?వాదాలు తెలిపారు. హైడ్రా, ప్ర?భుత్వానికి మ?ద్ధ?తుగా నినాదాలు చేశారు.

# జెఈఈ మెయిన్ పరీక్షలు నేపథ్యంలో ఇంజనీరింగ్ కళాశాలల పరిశీలన

## - జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డి





**మేడ్చల్ జిల్లా ప్రతినిధి, జనవరి 21, (తెలంగాణ దిశ)** :జెఈఈ (మెయిన్) 2026 పరీక్షల నిర్వహణలో ఏలాంటి లోటుపాట్లు లేకుండా సజావుగా, పకడ్బందీగా నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డి ఆదేశించారు. బుధవారం ఘట్కేసర్ మండలంలోని జెఈఈ మెయిన్ పరీక్షలు నిర్వహిస్తున్న సిద్దార్థ కాలేజీ, నల్ల మల్లారెడ్డి ఇంజనీరింగ్ కాలేజీలను పరిశీలించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ఈ నెల 21 నుండి 29 వరకు నిర్వహిస్తున్న జెఈఈ (మెయిన్) 2026 పరీక్షల నిర్వహణలో భాగంగా మేడ్చల్ జిల్లాలో 13 కేంద్రాలు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. పరీక్షా కేంద్రాలను పరిశీలించి ఏర్పాట్ల పై సంబంధిత అధికారులను వివరాలను అడిగి తెలుసుకున్నారు. పరీక్షలు పకడ్బందీగా ఏలాంటి ఘటనలు చోటు చేసుకోకుండా నిర్వహించాలని సూచించారు. అభ్యర్థులు ఏ విధమైన ఎలక్ట్రానిక్, వాచీలు తీసుకు రావద్దని అన్నారు. కేంద్రాల చుట్టూ పక్కల జిరాక్స్ షాపులు మూసి వేయాలని అన్నారు. పరీక్ష కేంద్రాల వద్ద ఫస్ట్ ఎయిడ్ కిట్, ఓఆరచవతీతీచస్ ప్యాకెట్లతో మెడికల్ టీం ఏర్పాటు చేసారని, పరీక్షా 144 సెక్షన్ అమలు చేస్తున్నారని ఆరా తీసారు. ఈ కార్యక్రమంలో ఘట్కేసర్ తహసీల్దారు చంద్రశేఖర్, కాలేజీల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# మల్లాపూర్ ఇందిరమ్మ క్యాంటీన్ లో టిఫిన్ సెక్షన్ ప్రారంభం

## - కేవలం రూ. ఐదుకే టిఫిన్ : పేదల కోసం కాంగ్రెస్ మరో అడుగు





**మల్లాపూర్, జనవరి 21, (తెలంగాణ దిశ)** :మల్లాపూర్ ప్రాంతంలో ఇప్పటికే కొనసాగుతున్న ఇందిరమ్మ క్యాంటీన్?లో బుధవారం టిఫిన్ సెక్షన్?ను కాంగ్రెస్ పార్టీ గ్రేటర్ సీనియర్ నాయకులు నెమలి అనిల్ కుమార్ ప్రారంభించారు. ఈ టిఫిన్ సెక్షన్ ద్వారా పేద ప్రజలు, కూలీలు, కార్మికులకు కేవలం ఐదు రూపాయలకే టిఫిన్ అందించనున్నారు. ఈ సందర్భంగా నెమలి అనిల్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఉప్పల్ నియోజకవర్గ ఇంచార్జీ మందముల పరమేశ్వర్ రెడ్డి ఆదేశాలతో టిఫిన్ సెక్షన్ ప్రారంభించినట్లు తెలిపారు. ఇందిరమ్మ క్యాంటీన్ పథకం కాంగ్రెస్ పార్టీ పేదల పక్షాన నిలిచే ఆలోచనకు నిదర్శనమన్నారు. ఇప్పటికే భోజన సౌకర్యం అందిస్తున్న క్యాంటీన్?లో ఇప్పుడు టిఫిన్ సెక్షన్ ప్రారంభించడం ద్వారా ఉదయం వేళల్లో కూడా పేదలకు తక్కువ ఖర్చుతో ఆహారం అందుబాటులోకి వస్తుందని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ పేదలు, బడుగు వర్గాల సంక్షేమమే లక్ష్యంగా పనిచేస్తుందని, రానున్న రోజుల్లో ప్రజలకు మరిన్ని ప్రజాహిత కార్యక్రమాలు చేపడతామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మల్లాపూర్ ప్రధాన కార్యదర్శి తాండ్ర శ్రీకాంత్ రెడ్డి, శేఖర్ బాబు, పాషా తదితరులు పాల్గొన్నారు.

# దర్గాగా రోడ్డు పక్క స్థలం కబ్జా

## - పార్కింగ్ కు ఇబ్బందులు..

## - కబ్జాకు కొందరు పెద్దల సహకారం





**ఏఎస్ రావునగర్, జనవరి 21,(తెలంగాణ దిశ)** :రోడ్డు పక్కన స్థలాన్ని ఓ నర్సరీ వ్యాపారి పూర్తిగా కబ్జా చేశాడు. దీంతో కనీసం నర్సరీకి వచ్చే వారూ సైతం పార్కింగ్ చేసుకోవడానికి స్థలం లేకుండా పోయింది. రాధిక, దమ్మాయిగూడ ప్రధాన రహదారిలో సాకేత్ టవర్ ముందు ఖాళీ స్థలాన్ని కబ్జా చేసి నర్సరీ వ్యాపారం కొనసాగిస్తున్నారు. చుట్టుపక్కల ప్రాంతాల్లో ఉన్న వ్యాపార సముదాయాలకు వచ్చే వారికి గతంలో ఇక్కడ పార్కింగ్ సౌకర్యం ఉండేది. దీంతో ట్రాఫిక్ కు పెద్దగా ఇబ్బందులు కలిగేవి కావు. అదే విధంగా రోడ్డు పక్కన విశాలమైన స్థలం ఉండడంతో ట్రాఫిక్ పోలీసులు, మోటార్ వెహికల్ అధికారులు తనిఖీల కోసం ఇదే స్థలంలో వాహనాలను చెక్ చేసేందుకు నిలిపేవారు. ప్రస్తుతం నర్సరీ వ్యాపారి కొందరు పెద్దల సహకారంతో రోడ్డు పక్క స్థలాన్ని పూర్తిగా కబ్జా చేయడంతో పార్కింగ్ సౌకర్యం లేకుండా పోయింది. నర్సరీ వ్యాపారి నుంచి కొంత మందికి మూడు పూలు అందు తున్నట్లు స్థానికులు చెబుతున్నారు. రోడ్డు పక్కన ఇంత పెద్ద స్థలాన్ని కబ్జా చేసుకుని నర్సరీ వ్యాపారం చేస్తున్నా పట్టించుకునే నాధులే కరువయ్యారని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ట్రాఫిక్ పోలీసులు, జిహెచచవతీతీచంసి అధికారులు స్పందించి రోడ్డు పక్కన ప్రమాదకరంగా ఏర్పాటు చేసిన నర్సరీ తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.

# పద్మశాలి సంఘం అధ్యక్షులు సుదర్శన్ కు ఘనంగా సన్మానం

**దమ్మాయిగూడ, జనవరి 21, (తెలంగాణ దిశ)** :పద్మశాలి సంఘం అధ్యక్షులుగా ఎన్నికైన రావిరాల సుదర్శన్ ను బుధవారం కాంగ్రెస్ నాయకులు ఘనంగా సన్మానించారు. కాంగ్రెస్ పార్టీ ఓబీసీ సెల్ తెలంగాణ రాష్ట్ర కన్వీనర్ పాతకోటి రామలింగం, పార్టీ నాయకులు తాళ్లపల్లి సందీప్ గౌడ్ శాలువాతో సత్కరించారు.

నూతనంగా ఎన్నికైన సందర్భంగా సుదర్శన్ కు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా సుదర్శన్ మాట్లాడుతూ దమ్మాయిగూడ పద్మశాలి సంక్షేమ సంఘం అధ్యక్షులుగా తనను భారీ మెజారిటీతో గెలిపించిన సంఘ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు.



# అంత్యక్రియలకు ఆర్థిక సహాయం అందజేసిన పొండల యాదగిరి గౌడ్

**దమ్మాయిగూడ, జనవరి 21, (తెలంగాణ దిశ) :**పేద కుటుంబానికి చెందిన గంపల మల్లేష్ అనారోగ్యంతో మృతి చెందటంతో అంత్యక్రియలకు బుధవారం కాంగ్రెస్ పార్టీ నాయకులు పొండాల యాదగిరి గౌడ్ రూ. ఐదు వేల ఆర్థిక సహాయం అంద చేసారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద కుటుంబం ఆపదలో ఉన్న సమయంలో సహాయం చేయడం ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అని అన్నారు. గంపల మల్లేష్ కుటుంబానికి పార్టీ తరపున అన్ని విధాలా అండగా ఉంటామని అన్నారు. ఈ కష్ట కాలంలో వారికి ధైర్యం చెప్పేందుకు తాము ఎప్పుడూ సిద్ధంగా ఉంటామని పేర్కొన్నారు. అలాగే మల్లేష్ ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తూ, కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు.



# సంపాదకీయం

## ప్రత్యేక చట్టాలకు నోచుకోని ఆదివాసీలు..!

దేశంలో తమ హక్కుల సాధన కోసం ఆదివాసీ సమాజాలు ఉద్యమించిన సందర్భాలు అనేకం ఉన్నాయి. బ్రిటిష్ చట్టాలకు వ్యతిరేకంగా బిర్సాముండా, సంతాల్‌లు, తిరుగుబాటు చేశారు. జల్, జంగల్, జమీన్ కోసం సాయుధ పోరాటాలు చేశారు. తమపై సాగుతున్న అన్నిరకాల దోపిడీ, పీడనలను ఎదిరించారు. అనేకసార్లు ఓటమి చెందినా తమ ఉనికే ప్రశ్నార్థకంగా మారుతున్న పరిస్థితులలో, తమ అస్తిత్వం కోసం అలుపెరుగని పోరాటాలు నేటికీ కొనసాగిస్తూనే ఉన్నారు. జీవన పోరాటంలో ఆరితేరిన వారు ఆదివాసీలు. వారు నివసించే ప్రాంతాలు పుష్కలమైన సహజ వనరులతో కళకళలాడు తుండేవి. సాటి మానవులుగా అనేక దేశాలలో వారికి తగిన గుర్తింపు, రక్షణ లేదు. ఆయా దేశాలలో కనీసపు చట్టాలు, హక్కులు కూడా లేవు. నాగరిక సమాజపు కొత్త పోకడలకు దూరంగా తమ కట్టు, బొట్టు, ఆచార వ్యవహారాలు, సంస్కృతి సంప్రదాయాలను కాపాడుకుంటు, తరతరాలుగా భావి తరాలకు అందిస్తున్నారు. యేడాది పొడవునా వారు జరుపుకునే పండుగలు, వేడుకల్లో వారి సంస్కృతి ప్రతిబింబిస్తుంది.ప్రొఫెషనల్ అసిస్టెన్స్ ఫర్ డెవలప్‌మెంట్ యాక్షన్ ఏప్రిల్‌లో ప్రచురించిన స్టేటస్ ఆఫ్ ఆదివాసీ లైవ్లీహుడ్ రిపోర్ట్, 2021 ప్రకారం, భారతదేశం లోని ఆదివాసీ జనాభా ఆదివాసీయేతర జనాభాతో పోలిస్తే పేద జీవన ప్రమాణాలను కలిగి ఉంది. దేశ జనాభాలో 8.6% మంది షెడ్యూల్డ్ తెగలు (ఎస్టీలు) ఉన్నారు. వారిలో ఎక్కువ మంది 'కొండలు మరియు అడవులు' తెగలుగా వర్గీకరించబడ్డారు.ఆదివాసీలు ఒడిషా, మధ్యప్రదేశ్, చత్తీస్‌ఘడ్, రాజస్థాన్, గుజరాత్, మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, బీహార్, జార్ఖండ్, పశ్చిమ బెంగాల్, మిజోరం, అండమాన్ నికోబార్ దీవులలో ఎక్కువగా జీవిస్తున్నారు.రాజ్యాంగంలోని ఆర్టికల్ 244 ఆదివాసీ సంఘాలు అధికంగా నివసించే ప్రాంతాలను గుర్తించాలని రాష్ట్రాన్ని ఆదేశిస్తుంది. ఈ ప్రాంతాలలో వారిని, వారి గుర్తింపును పెంపొందించడానికి, వారిని అభివృద్ధి ప్రక్రియలో ఏకీకృతం చేయాలని నిర్దేశిస్తుంది. ఆర్టికల్ 275 రాష్ట్రాలకు ఆర్థిక కేటాయింపులు చేయడానికి స్పష్టమైన నిబంధనలను చేస్తుంది. ఆర్టికల్ 275 కింద నిధులతో కేంద్ర మద్దతు ఉన్న గిరిజన ఉప ప్రణాళికలతో పాటు గిరిజన ప్రజల సంక్షేమాన్ని ప్రోత్సహించడానికి అనేక నిర్దిష్ట కార్యక్రమాలు రూపొందించి అమలు చేయబడ్డాయి. అయితే, ఈ ప్రయత్నాల ఫలితాలపై చాలా తక్కువ సమాచారం అందుబాటులో ఉందని నివేదిక ఎత్తి చూపింది. మన దేశంలో సుమారు 600 ఆదివాసీ తెగలు గుర్తించ బడ్డాయి. భారత రాజ్యాంగం వీరికి చట్టపరమైన రక్షణలు కల్పించింది. 1874లోనే ప్రత్యేక షెడ్యూల్డ్ జిల్లాల చట్టం చేయబడింది. 1917లో ఆదివాసీ తెగల నివాస ప్రాంతాలలో ఉమ్మడి భూమి హక్కులు ఇవ్వబడ్డాయి. ఆదివాసీ తెగలకు అటవీ భూములపై హక్కులు కల్పిస్తూ 2006లో చట్టం చేయబడింది. చట్టం ప్రకారం అటవీ భూమిపై ఆధారపడి జీవిస్తున్న ప్రతి గిరిజన కుటుంబానికీ 10 ఎకరాల వరకూ పట్టా ఇవ్వవచ్చు. స్వాతంత్ర్యం వచ్చి 75 ఏళ్లు కావస్తున్నా ఆదివాసీ తెగలు తమ సంప్రదాయపు భూముల నుంచి, అటవీ ప్రాంతం నుంచి నెట్టివేయబడుతున్నారు. అవిభక్త ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రంలో 1/70 చట్టం అమలులో ఉన్నది. గిరిజనుల సాంప్రదాయక భూములు గిరిజన తెగలకే దక్కాలి. గిరిజనేతరులకు షెడ్యూల్డ్ భూమిపై ఎట్టి హక్కూ లేదు. ఉభయ తెలుగు రాష్ట్రంలో షెడ్యూల్డ్ ప్రాంతంలో 48 శాతం సంప్రదాయక గిరిజన భూములను గిరిజనేతరులు ఆక్రమించు కున్నారు. ఆదివాసీ తెగల వాయిద్య పరికరాలు, వారి నృత్యాలు ప్రభుత్వం ప్రోత్సాహం లేక అంతరించి పోతున్నాయి. ఆదివాసీ ప్రాంతాలలోకి పర్యాటకం ప్రవేశించాక ఆదివాసీ కళలు వ్యాపార సరుకులుగా మారి పోయాయి. స్వాతంత్ర్యం వచ్చి యేళ్లు గడుస్తున్నా అభివృద్ధికి నోచు కోని గిరిపల్లెలు నేటి ఉన్నాయి. విద్య, వైద్య, రవాణా విషయంలో గిరిజన గూడాలు, తాండాల్లో నేటికి ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. నడవడానికి రోడ్డు, తాగటానికి నీటి సౌకర్యం కూడా లేని పల్లెలున్నాయి. ఇప్పటికి పోడు భూముల సమస్య, అటవీ భూములకు పట్టాలు, ప్రభుత్వ అజమాయిషీ కాకుండా గ్రామసభల ద్వారా స్వయం పాలన ఉద్దేశిత పీసా చట్టం అమలు కోసం గిరిజన ప్రాంతాల్లో ఆదివాసీ సంఘాలు పోరాటాలను కొనసాగిస్తూనే ఉన్నాయి. తెలంగాణలో గతకేసిఆర్ ప్రభుత్వం వీరి స్వయం పరిపాలనే లక్ష్యంగా ప్రత్యేక గ్రామ పంచాయతీలు ఏర్పాటుచేసి ప్రత్యేక నిధులు కేటాయించింది. పోడు భూముల విషయంలోనూ ప్రత్యేక కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేసుకుంది కూడా.పోడు చేసుకుంటున్న ఆదివాసీలపై, పోడు భూముల్లో ఆదివాసీలు వేసుకున్న గుడిసెలను అటవీశాఖ అధికారులు తొలగించడం, దాడులు చేయడం, తీవ్ర ఇబ్బందులకు గురి చేయడం, తమ గుడిసెలు తొలగించవద్దంటూ అధికారులను అడ్డుకునే ప్రయత్నం చేయడం అక్కడక్కడా చోటు చేసుకుంటు న్నాయి. 1/70, పీసా, అటవి హక్కుల చట్టం అమలు చేయాలని, ఏజెన్సీలో భూ దురాక్రమణపై కమిటీ వేయాలని,ఏజెన్సీ ప్రాంతాన్ని ఒక యూనిట్‌గా కలిపి స్వయం పాలన కల్పించాలని, ట్రైబల్ సబ్‌ప్లాన్ నిధులు సంపూర్ణంగా ఆదివాసీలకే కేటాయించా లని, గొండు, కోయ వారికి పదో తరగతి వరకు వారి మాతృభాషలోనే బోధన చేయాలని, జిఒనెం.3ని అమలు చేయాలని ఆదివాసీలు చేసే డిమాండ్ల పరిష్కారం కోసం ప్రభుత్వం కృషి చేస్తూ, గిరిజన అభివృద్ధికి ఇతోధిక సంక్షేమ కార్యక్రమాల అమలు అనివార్యంగా, అత్యవసరంగా చేయాల్సి ఉంది.

# ఓటరు జాబితా అనుసంధాన ప్రక్రియను నెలాఖరులోగా పూర్తి చేయాలి..



### - మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డి

**మేడ్చల్‌జిల్లా ప్రతినిధి, జనవరి 21, (తెలంగాణ దిశ) :** జిల్లాలో ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణలో భాగంగా 2002 నుండి ఉన్న ఓటరు జాబితాను 2025 ఓటరు జాబితాకు అనుగుణంగా సవరించే మ్యాపింగ్ ప్రక్రియపై ప్రత్యేక శ్రద్ధ వహించి ఈ నెలాఖరు వరకు పూర్తి చేయాలని సంబంధిత తహసీల్దార్లను మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డి ఆదేశించారు. బుధవారం కీసర తహసీల్దారు కార్యాలయంలో ఓటరు జాబిత అను సంధాన ప్రక్రియ పురోగతి పై అదనపు కలెక్టర్ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో తక్కువ శాతం ఉన్న నియోజకవర్గాలలో మ్యాపింగ్ ప్రక్రియను వేగవంతం చేయాలని, ఈ నెలాఖరులోగా పూర్తి చేయాలని ఎఈఆర్‌లను ఆదేశించారు. ఎఈఆర్‌లు పూర్తి బాధ్యత తీసుకొని బిఎలచవతీతీచలకు రోజువారి లక్ష్యాలను ఇచ్చి ప్రక్రియను వేగవంతం చేయాలని సూచిం చారు. అదనపు కలెక్టరు మ్యాపింగ్ ప్రక్రియ నిర్వహా ణలోని సమస్యలను అడిగి తెలుసుకొని తగిన సలహాలు, సూచనలు అందించారు.

ఈ సమావేశంలో కీసర ఆర్డీఓ రాజేష్, కీసర తహసీల్దారు యాదగిరి, శామీర్ పేట్ తహసీల్దారు సుచరిత, ఘట్కేసర్ తహసీల్దారు చంద్రశేఖర్, మేడిపల్లి తహసీల్దారు కృష్ణ చైతన్య, మేడ్చల్ తహసీల్దారు భూపాల్, ఎంసిపల్లి డిటి సునీల్, మున్సిపల్ కమీషనర్లు, సూపర్ వైజర్లు, బిఎలచవతీతీచలు తదితరులు పాల్గొన్నారు.



# ప్రజాస్వామ్య స్థితిని ప్రతిబింబిస్తున్న వాంగ్‌చుక్



**న్యూఢిల్లీ :** పర్యావరణ కార్యకర్త సోనమ్ వాంగ్‌చుక్ అరెస్ట్ దేశంలో ప్రజాస్వామ్య పరిస్థితిని ప్రతిబింబిస్తుందని ఆయన భార్య గీతాంజలి ఆంగ్మో అన్నారు. ప్రజలను 'చట్టవిరుద్ధం'గా నిర్బంధించడానికి 'అధికారాన్ని' వినియోగిస్తున్నారని తెలిపారు. ఆదివారం ఆమె జాతీయ మీడియాకిచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూలో మాట్లాడారు. ప్రభుత్వం కోర్టులో పదేపదే కొత్త తేదీలను కోరుతున్నం దున ఈ కేసుకు ఎటువంటి అర్హతా లేదని అన్నారు. అధికారుల విధానపరమైన లోపాలను పరిగణనలోకి తీసుకుంటే, వాంగ్‌చుక్ ఇప్పటికే జైలు నుంచి బయటకు రావాలని, ఇది చాలా సులభంగా పరిష్కరించగల కేసు అని అన్నారు.

వాంగ్‌చుక్ నిర్బంధంపై బలమైన ప్రతిఘటన రాకపోవడంతో తాను కొంచెం నిరాశ చెందానని ఆంగ్మో చెప్పారు. మేము మౌనంగా ఉండబోమనీ, ఆయన అరెస్టును సమిష్టిగా, గట్టిగా వ్యతిరేకిస్తామని ఆమె పిలుపునిచ్చారు. ఇది కేవలం ఒక వ్యక్తిగా సోనమ్ వాంగ్‌చుక్ గురించి మాత్రమే కాదని, ఈ దేశంలో ప్రజాస్వామ్య పరిస్థితి గురించి, ఈ దేశం కోసం పనిచేస్తున్న వ్యక్తులను అక్రమంగా నిర్బంధించడానికి అధికారాన్ని ఉపయోగించడం గురించి అని అన్నారు. సోనమ్‌ని అరెస్ట్ చేసినవారు, ఎవరినైనా ఎప్పుడైనా అరెస్ట్ చేయవచ్చని ఆమె చెప్పారు. లడఖ్‌కు రాష్ట్ర హోదా, ఆరో షెడ్యూల్ హోదాను డిమాండ్ చేస్తూ చేపట్టిన నిరసనలపై పోలీసుల కాల్పుల్లో నలుగురు మరణించగా, 90మంది గాయప డ్డారు. పర్యావరణ కార్యకర్త వాంగ్‌చుక్‌ను సెప్టెంబర్ 26న జాతీయ భద్రతా చట్టం (ఎన్ఎస్ఎ) కింద అరెస్ట్ చేసి, రాజస్తా న్‌లోని జోధ్‌పూర్ జైలుకు తరలించిన సంగతి తెలిసిందే.

వాంగ్‌చుక్ నిర్బంధాన్ని సవాలు చేస్తూ, ఆయనను వెంటనే విడుదల చేయాలని కోరుతూ హెబియస్ కార్పస్ పిటిషన్ దాఖలు చేశారు. నిర్బంధ ఉత్తర్వులు పొందడం, సోనమ్‌ను కలవడం చాలాకష్టమైందని అన్నారు. సుప్రీంకోర్టులో హెబియస్ కార్పస్ పిటిషన్ దాఖలు చేయాల్సి వచ్చిందని, పిటిషన్ దాఖలు చేసిన తర్వాత కూడా ఆయన చేతితో రాసిన నోట్‌ను పొందడం ఒక సవాలుగా మారిందని ఆమె చెప్పారు. ఎన్ఎస్ఎ ప్రకారం.. అధికారులు నిర్బంధానికి గల కారణాలను నిర్ధారించే పత్రాలతో సహా అన్ని పత్రాలను నిర్బంధించిన వారికి ఐదు లేదా గరిష్ఠంగా 10 రోజుల్లో అందించాలని అన్నారు.


# ఇప్పుడు సమయం ఆసన్నమైంది...



గ్రీన్‌ల్యాండ్ నుండి 'రష్యా ముప్పు'ను దూరం చేయడానికి డెన్మార్క్ ఎలాంటి చర్యలు తీసుకోలేదని, కానీ ఇప్పుడు సమయం ఆసన్నమైందని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఆదివారం పేర్కొన్నారు. గ్రీన్‌ల్యాండ్‌పై రష్యా ముప్పును దూరం చేయాలి అని నాటో 20 ఏళ్లుగా డెన్మార్క్‌ను హెచ్చరిస్తోందని, కానీ డెన్మార్క్ ఇప్పటి వరకు ఎటువంటి చర్యలు తీసుకోలేదని ట్రంప్ తన సోషల్‌మీడియా వెబ్‌సైట్ ట్రూత్‌లో ఒక పోస్ట్‌లో తెలిపారు. ఇప్పుడు సమయం ఆసన్నమైందని, చర్యలు తీసుకుంటామని అన్నారు.

అయితే ట్రంప్ బెదిరింపులను డెన్మార్క్, గ్రీన్‌ల్యాండ్‌లు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాయి. గ్రీన్‌ల్యాండ్ అమ్మకానికి లేదని, అమెరికాలో భాగం కావాలనుకోవడం లేదని స్పష్టం చేశాయి. మరోవైపు గ్రీన్‌ల్యాండ్ స్వాధీనానికి మద్దతు ఇవ్వని యూరోపియన్ యూనియన్ దేశాలపై ట్రంప్ 10శాతం సుంకాలు విధించారు. దీంతో అమెరికాలో గతంలో కుదుర్చుకున్న వాణిజ్య ఒప్పందాన్ని ఆమోదించేందుకు యూరోపియన్ పార్లమెంట్ తిరస్కరించింది. జీరో–టారిఫ్ ఒప్పందం ముందుకు తీసుకువెళ్లడం సాధ్యపడదని, ప్రతిచర్యలు తీసుకునేందుకు సిద్ధంగా ఉంటామని పార్లమెంట్ సభ్యులు హెచ్చరించారు.

# ఢిల్లీలో ప్రమాదకర స్థాయిలో గాలినాణ్యతలు



**న్యూఢిల్లీ :** దేశ రాజధాని ఢిల్లీని పొగమంచు కమ్మేసింది. అక్కడ గాలి నాణ్యతలు ప్రమాదకర స్థాయిలో నమోదయ్యాయి. సోమవారం ఢిల్లీలో గాలి నాణ్యతలు 418 స్థాయిల వద్ద నమోదయ్యాయి. దీంతో వీటి స్థాయిల్ని కేంద్ర కాలుష్య నియంత్రణ మండలి (సిపిసిబి) ప్రమాదకర స్థాయిలో వర్గీకరించింది. సిపిసిబి సమాచారం ప్రకారం.. ఢిల్లీలో కొన్ని ప్రాంతాల్లో ఎక్యూఐ స్థాయిలు ఈవిధంగా ఉన్నాయి. ఇన్‌కమ్‌ట్యాక్స్ ఆఫీస్ వద్ద 434, రఫీమార్గ్ సమీపంలో 417, స్వామినారాయణ్ అక్షరధామం ఆలయం వద్ద 455 ఎక్యూఐ స్థాయిలు నమోదయ్యాయి. ఇక ఆనంద్ విహార్:462, అశోక్ విహార్ : 473, బవానా: 448, చాందినీ చౌక్ 454, ద్వారకా సెక్టార్ ? 8 : 427, ముండ్కా 467, నరేలా 437, పంజాబ్ బాగ్ : 434, ఆర్ కె పురం : 439, రోహిణి : 437, వాజీర్పూర్ : 472 స్థాయిలు వద్ద ఎక్యూఐ నమోదైంది. ప్రమాదకర స్థాయిలోనే ఎక్యూఐ నమోదైందని కేంద్ర కాలుష్య నియంత్రణ మండలి పేర్కొంది. గాలి నాణ్యతలు పడిపోవడంతో.. ఢిల్లీవాసులు శ్వాసకోశ సమస్యలతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

# కేంద్ర పాలిత ప్రాంతంగా చండీగఢ్!



### -బిల్లుపై ప్రతిపక్షాల ఆగ్రహం
### -తుది నిర్ణయం తీసుకోలేదన్న కేంద్ర హోం శాఖ

న్యూఢిల్లీ : పంజాబ్, హర్యానా సంయుక్త రాజధాని చండీగఢ్‌లో చట్టాలు చేసే అధికారాన్ని రాష్ట్రపతి పరిధిలోకి తీసుకొచ్చే రాజ్యాంగ అధికరణ 131 సవరణ బిల్లు పార్లమెంట్ శీతాకాల సమావేశాల్లో ప్రవేశపెట్టనున్నట్లు కేంద్రప్రభుత్వం చేసిన ప్రకటనపై ప్రతిపక్షాలు ఆగ్రహం వ్యక్తం చేశాయి. కేంద్రంలో అధికారంలోకి వచ్చిననాటి నుంచి సమాఖ్య స్ఫూర్తిని నిర్వర్యం చేస్తూ వచ్చిన బిజెపి ప్రభుత్వం వివిధ రూపాల్లో రాష్ట్రాల హక్కులను, అధికారాలను గుంజేసుకొని తన గుప్పిట్లో పెట్టుకుంటోంది. అదే క్రమంలో జమ్ముకాశ్మీర్‌ను కేంద్ర పాలిత ప్రాంతాలుగా ముక్కలు చేసి..రాష్ట్ర హోదా హామీ నెరవేర్చకుండా మీనమేషాలంటూ దాటవేస్తోంది. అదే తరహా కుటిల వ్యూహాన్ని ఇప్పుడు ప్రశాంతంగా ఉన్న పంజాబ్‌లోనూ అమల్జేసేందుకు మోడీ సర్కార్ పూనుకుంటోందని ప్రతిపక్షాలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి. సర్వత్రా ఆగ్రహావేశాలు పెల్లుబికిన నేపథ్యంలో.. ఆ ప్రతిపాదనపై తుది నిర్ణయం తీసుకోలేదని, పార్లమెంట్‌లో ప్రవేశపె ట్టడం లేదని కేంద్ర హోం మంత్రిత్వశాఖ ప్రకటించింది. కేంద్ర పాలిత ప్రాంతాలకు వర్తించే ఆదేశాలు, చట్టాలను నేరుగా చేసే అధికారాలను రాష్ట్రపతికి కల్పించిన రాజ్యాంగ అధికరణం 240 పరిధిలోకి చండీగఢ్‌ను తీసుకురావాలని కేంద్రం ప్రతిపాదించిం ది. త్వరలో జరగనున్న శీతాకాల సమావేశాల్లోనే ఈ అంశంపై బిల్లు పార్లమెంటులో ప్రవేశపెట్టనున్నట్లు శనివారం ప్రకటించింది. చట్టసభల్లేని కేంద్ర పాలిత ప్రాంతాలైన అండమాన్–నికోబార్ దీవులు, దాద్రా–నగర్ హవేలీ, దమణ్–దీవ్ ప్రస్తుతం అధికరణం 240 పరిధిలో ఉన్నాయి. ఈ అధికారణం పరిధిలోకి చండీగఢ్‌ను తీసుకువచ్చే బిల్లు ఆమోదం పొందితే రాష్ట్రపతికి చండీగఢ్‌లో చట్టాలు చేసే అధికారం ఉంటుంది. దీంతో ఆమ్ ఆద్మీపార్టీ, కాంగ్రెస్, అకాలీదళ్ ఈ బిల్లును తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాయి. కేంద్రంలోని ఎన్‌డిఎ ప్రభుత్వం పంజాబ్ రాజధానిని లాక్కోవడానికి ప్రయత్నిస్తోం దని పంజాబ్ ముఖ్యమంత్రి, ఆప్ నాయకులు భగవంత్ మాన్ విమర్శి ంచారు. చండీగఢ్ గతంలోనూ, ప్రస్తుతం, భవిష్యత్తులోనూ పంజాబ్‌తో విడదీయరాని భాగమేనని పేర్కొన్నారు. ఆమ్‌ఆద్మీ పార్టీ అధినేత అరవింద్ కేజ్రీవాల్ కూడా పంజాబ్ గుర్తింపుపై కేంద్రం దాడి చేస్తోందని విమర్శించారు. చండీగఢ్ పంజాబ్‌కు చెందినదేనని, దానిని లాక్కోవడానికి చేసే ప్రయత్నాలకు తీవ్ర ప్రతికూల పరిణామాలు ఉంటాయని పంజాబ్ కాంగ్రెస్ చీఫ్ అమరీందర్ సింగ్ పేర్కొన్నారు. అకాలీదళ్ నేత సుఖ్‌బీర్‌సింగ్ బాదల్ కూడా దీనిని పంజాబ్ వ్యతిరేక బిల్లుగా అభివర్ణించారు. మొదట ప్రకటించడం, ఆ తరువాత ఆలోచిస్తున్నామనడం కేంద్ర ప్రభుత్వానికి పరిపాటిగా మారిందని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ఇన్‌ఛార్జి (కమ్యూనికేషన్స్) జైరామ్ రమేష్ ఎక్స్‌లో పోస్ట్ చేశారు.

పార్లమెంట్ శీతాకాల సమావేశాల్లో చండీగఢ్ పరిపాలనకు సంబంధించి ఎలాంటి బిల్లును ప్రవేశపెట్టే ఉద్దేశం కేంద్రానికి లేదని కేంద్ర హోం మంత్రిత్వశాఖ ఒక ప్రకటన విడుదల చేసింది. చండీగఢ్ కేంద్రపాలిత ప్రాంతానికి సంబంధించిన కేంద్రప్రభుత్వ చట్టం రూపొందించే ప్రక్రియను సరళీకరించాలన్న ప్రతిపాదన ఇంకా పరిశీలనలో ఉందని పేర్కొంది. 1966లో పంజాబ్ నుంచి హర్యానా విడిపోయిన తర్వాత చండీగఢ్‌ను కేంద్రపాలిత ప్రాంతంగా ప్రకటించారు. పంజాబ్, హర్యానాకు అప్పటి నుంచి చండీగఢ్ ఉమ్మడి రాజధానిగా కొనసాగుతోంది. ప్రస్తుతం పంజాబ్ గవర్నర్ చండీగఢ్ అడ్మినిస్ట్రేటర్‌గా పాలన నిర్వహిస్తున్నారు. చండీగఢ్ పంజాబ్‌దేనని పలు రాజకీయ పార్టీలు డిమాండ్ చేస్తున్నాయి. హర్యానాకు ప్రత్యేక రాజధాని ఏర్పాటు చేయాలని కోరుతున్నాయి.


## PUBLIC NOTICE

**"I, SHAIK SHAKEER** Residing at Flat No. 301, 03rd floor, K K Residency, Mallikarjun Nagar, Banjara Colony, Kapra (M), Medchal Malkajgiri (D), Hyd - 500 062, hereby declare that my son's name has been wrongly entered in his **Aadhaar Card (5584 2290 5338)** as **SHAIK ASHAZ** instead of his correct name **SHAIK AFTHAAB ASHAZ.** The correct name of my son is **SHAIK AFTHAAB ASHAZ.**

**"Sd/-**
**"(Shaik Shakeer)**

## PUBLIC NOTICE

"Change of name"I, **SADASIVUNI LAXMIKANTAM,** W/o SADASIVUNI RAMANA MURTHY, residing at H.No. 1-9-227/1, Hanuman Nagar Colony, kushaiguda, ECIl post, Kapra (M), Medichal-Malkajgiri (D), Hyd-500 062. here by declare that my name has been wrongly entered in Aadhar (9371 3992 5083) as SADA SIVUNI LAXMIKANTAM but my actual name is SADASIVUNI LAXMIKANTAM. Henceforth, I shall be known and called as SADASIVUNI LAXMIKANTAM for all official and personal purposes.

## విద్యార్థి సంద్రంగా డిస్ట్రిక్ట్ సైన్స్ ఎగ్జిబిషన్



బోధన్ : శాస్త్ర, సాంకేతిక అభివృద్ధి, నూతన ఆవిష్కరణలు, విజ్ఞానశాస్త్రాల ప్రాధాన్యత పై విద్యార్థుల్లో అవగాహన పెంపొందించడం లక్ష్యంగా జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో బోధన్‌లోని విజయమేరి హై స్కూల్‌లో నిర్వహిస్తున్న జిల్లా బాల వైజ్ఞానిక ప్రదర్శన విద్యార్థి సంద్రంగా మారిపోయింది. జిల్లా వ్యాప్తంగా ఉన్న పలు మండలాలకు చెందిన ప్రభుత్వ, ప్రైవేట్ విద్యాసంస్థల విద్యార్థులు తమ క్రియేటివిటీ, ప్రతిభను ఆవిష్కరించే వేదికగా ఉపయోగించుకున్నారు. సైన్స్, మాథ్స్, పర్యావరణం, వ్యవసాయం, టెక్నాలజీ, ఇన్నోవేషన్ వంటి విభాగాల్లో సుమారు 550కి పైగా మోడళ్లు, ప్రాజెక్టులు ప్రదర్శించబడ్డాయి. విద్యార్థులు రూపొందించిన స్మార్ట్ ఇరిగేషన్ సిస్టమ్‌లు, రోబోటిక్ మోడల్స్, ప్లాస్టిక్ రీసైక్లింగ్ టెక్నిక్స్, ఎనర్జీ కన్జర్వేషన్ ప్రాజెక్ట్‌లతో పాటు అవార్డు పొందిన ప్రాజెక్టులు సరికొత్త ఆలోచనలతో ఆకట్టుకున్నాయి. ప్రాజెక్ట్‌లను చూసేందుకు వచ్చిన వేలాది విద్యార్థులతో సైన్స్ ఎగ్జిబిషన్, స్కూల్ ఆవరణ మొత్తం విద్యార్థులు, ఉపాధ్యాయులు, సందర్శకులతో కిక్కిరిసిపోయింది. మోడళ్లను ఎలా రూపొందించారో, వాటి వెనుకున్న సైన్స్‌ను ఏకగళంగా వివరించిన విద్యార్థులు ఇతరులకు ప్రేరణగా నిలిచారు. ఈ సందర్భంగా సందర్శనకు వచ్చిన విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా సంబంధిత అధికారులు ఏర్పాట్లు చేశారు. శానిటేషన్, తాగునీటి సౌకర్యం, భద్రత వంటి అంశాలను పర్యవేక్షించేందుకు ప్రత్యేక బృందాలను నియమించారు. భవిష్యత్తు శాస్త్రవేత్తలు, పరిశోధకులను తయారుచేసే ఇలాంటి వేదికలు విద్యార్థుల కెరీర్ నిర్మాణానికి బాటలు వేస్తాయని ఉపాధ్యాయులు తెలిపారు.

# ఈ విటమిన్లను రోజూ తీసుకోవాల్సిన అవసరం లేదు..

### వారంలో రెండు సార్లు చాలు..

మనల్ని ఆరోగ్యంగా ఉంచడంలో పోషకాలు ముఖ్యపాత్ర పోషిస్తాయి. పోషకాల్లో అనేక రకాలు ఉంటాయి. వాటిల్లో విటమిన్లు కూడా ఒకటి. విటమిన్లు ఎ, బి కాంప్లెక్స్, సి, డి, ఇ, కె ఇలా అనేక రకాలు ఉన్నాయి. ఈ క్రమంలోనే రోజూ అన్ని రకాల విటమిన్లను మనం శరీరానికి అందేలా చూసుకోవాలి. అయితే విటమిన్లలో రెండు రకాలు ఉంటాయి. కొన్ని నీటిలో కరుగుతాయి.

కొన్ని కొవ్వుల్లో కరుగుతాయి. నీటిలో కరిగే విటమిన్లను మన శరీరం నిల్వ ఉంచుకోదు. అధికంగా ఉంటే బయటకు పంపిస్తుంది. కనుక ఇలాంటి విటమిన్లను మనం రోజూ తీసుకోవాలి. అదే కొవ్వులో కరిగే విటమిన్లను అయితే శరీరం నిల్వ ఉంచుకుంటుంది. కనుక ఈ విటమిన్లను రోజూ తీసుకోవాల్సిన అవసరం లేదు. విటమిన్లు బి, సిలు నీటిలో కరుగుతాయి. కనుక వీటిని రోజూ తీసుకోవాలి. విటమిన్లు ఎ, డి, ఇ, కె లు కొవ్వులో కరుగుతాయి. కనుక వీటిని వారంలో 2 లేదా 3 సార్లు తీసుకుంటే సరిపోతుంది.

ఇవి కొవ్వులో కరుగుతాయి..: విటమిన్లు ఎ, డి, ఇ, కె లు కొవ్వులో కరుగుతాయి.మనం తినే ఆహారాల్లో ఉండేఈ విటమిన్లు మన శరీరంలో నిల్వ ఉండే కొవ్వులో కరుగుతాయి. అప్పుడు మన శరీరంలోని కొవ్వు వినియోగం అవుతుంది. అనంతరం ఆ విటమిన్లను శరీరం శోషించుకుని నిల్వ చేస్తుంది. దీంతో విటమిన్లు ఎ,డి,ఇ, కెలు మనకు లభిస్తాయి. వీటిని శరీరం శోషించుకున్న తరువాత లివర్ లేదా కొవ్వు కణజాలంలో నిల్వ ఉంచుతుంది. అవసరం అయినప్పుడు ఉపయోగించుకుంటుంది. కనుక విటమిన్లు ఎ, డి, ఇ, కె లను వారంలో రెండు సార్లు లభించేలా చూసుకుంటే సరిపోతుంది. కొవ్వులో కరిగే ఈ విటమిన్ల వల్ల మనకు అనేక లాభాలు కలుగుతాయి. విటమిన్ ఎ కంటిచూపును మెరుగు పరుస్తుంది. రోగ నిరోధక శక్తి పెరిగేలా చేస్తుంది. చర్మాన్ని సంరక్షిస్తుంది. గుండె ఆరోగ్యానికి మేలు చేస్తుంది.


అనేక ఉపయోగాలు..: విటమిన్ డి వల్ల రోగ నిరోధక శక్తి పెరగడంతోపాటు ఎముకలు దృఢంగా మారి ఆరోగ్యంగా ఉంటాయి. అలాగే విటమిన్ ఇ చర్మాన్ని రక్షిస్తుంది. రోగ నిరోధక శక్తిని పెంచుతుంది. క్యాన్సర్ కణాలను నాశనం చేస్తుంది. విటమిన్ ఇ




వల్ల పురుషుల్లో నపుంసకత్వ సమస్య తగ్గుతుంది. శిరోజాలు, చర్మం ఆరోగ్యంగా ఉంటాయి. విటమిన్ కె వల్ల గాయాలు అయినప్పుడు రక్తం త్వరగా గడ్డ కట్టేలా చేస్తుంది. దీని వల్ల తీవ్ర రక్త స్రావం జరగకుండా అడ్డుకోవచ్చు. అలాగే విటమిన్ కె ఎముకల నిర్మాణానికి, దృఢత్వానికి సహాయం చేస్తుంది. కనుక కొవ్వులో కరిగే ఈ విటమిన్లను మనం వారంలో రెండు సార్లు లభించేలా చూసుకుంటే సరిపోతుంది. ఇక ఈ విటమిన్లు కొవ్వులో కరుగుతాయి కనుక మన శరీరంలో కొవ్వు కూడా ఉండాల్సిందే. కొందరు అసలు కొవ్వు ఉండొద్దని భావిస్తారు. కానీ అది సరికాదు. ఎందుకంటే ఆయా విటమిన్లు కరిగేందుకు, పలు రకాల జీవక్రియలు సక్రమంగా నిర్వహించబడేందుకు కొవ్వు అవసరం అవుతుంది. కనుక శరీరంలో పరిమిత మోతాదులో కొవ్వు తప్పనిసరిగా ఉండాలని పోషకాహార నిపుణులు చెబుతున్నారు.

ఈ ఆహారాలను తినాలి..: విటమిన్లు ఎ, డి, ఇ, కెలను పొందడం కోసం మనం భిన్న రకాల ఆహారాలను తినాల్సి ఉంటుంది. బాదంపప్పు, జీడిపప్పు, వాల్ నట్స్, పిస్తా, గుమ్మడి విత్తనాలు, పొద్దు తిరుగుడు విత్తనాలు, చియా సీడ్స్, అవిసె గింజలు, చేపలు, పాలు, కోడిగుడ్లు, చికెన్, మటన్, రొయ్యలు, పాలకూర, గుమ్మడికాయలు, యాపిల్స్, క్యారెట్లు, చీజ్, టమాటాలు, వెన్న, నెయ్యి, పుట్ట గొడుగులు, మటన్ లివర్, మొలకలు, సోయా బీన్స్ వంటి ఆహారాలను తరచూ తీసుకుంటుంటే ఆయా విటమిన్లు అన్నింటినీ పొందవచ్చు. అయితే రోజూ ఉదయం శరీరానికి సూర్య రశ్మి తగిలేలా కనీసం 20 నిమిషాల పాటు ఎండలో ఉంటే మనకు కావల్సినంత విటమిన్ డి లభిస్తుంది. దీని వల్ల చర్మం కింది పొరల్లో ఉండే కొవ్వులో విటమిన్ డి తయారవుతుంది. ఇలా ఆయా విటమిన్లను తరచూ పొందడం వల్ల ఆరోగ్యంగా ఉండవచ్చు.

# స్వల్పంగా తగ్గిన బంగారం,వెండి ధరలు



న్యూఢిల్లీ, : అమెరికా కరెన్సీ డాలర్ బలపడుతున్న నేపథ్యంలో ప్రపంచవ్యాప్తంగా బంగారం ధరలు స్వల్పంగా దిగొచ్చాయి. భారత్‌లో కూడా బంగారం ధర చెప్పుకోదగ్గ స్థాయిలో తగ్గింది. పెళ్లిళ్ల సీజన్ కొనసాగుతున్నా కూడా రేట్స్‌లో కోత పడింది. దేశంలో ఉదయం సమయంలో 24 క్యారెట్ 10 గ్రాముల బంగారం ధర రూ. 1,25,120. నిన్నటి ధరతో పోలిస్తే రూ.463 మేర తగ్గింది. ఇక 22 క్యారెట్ 10 గ్రాముల పసిడి ధర కూడా నిన్నటితో పోలిస్తే రూ.650 మేర తగ్గి రూ.1,14,690కు చేరుకుంది. వెండి ధరల్లో కూడా తగ్గుదల కనిపించింది. సోమవారం నాటి ధరతో పోలిస్తే ప్రస్తుతం వెండి రేటు రూ. వెయ్యి మేర తగ్గి రూ.1,62,900కు చేరింది. డాలర్ బలపడటంతో బంగారానికి డిమాండ్ కాస్త తగ్గిందని నిపుణులు చెబుతున్నారు. డాలర్ సూచీ ప్రస్తుతం 100 మార్కుకు పైనే కదలాడుతోంది. గత ఆరు నెలల్లో ఇదే అత్యధికం. దీంతో ఇన్వెస్టర్లకు కమోడిటీ మార్కెట్‌పై ఆసక్తి తగ్గింది. ఈ నేపథ్యంలో వచ్చే నెలలో జరగనున్న అమెరికా ఫెడరల్ రిజర్వ్ సమావేశాలపైనే అందరి దృష్టి నెలకొంది. ఈసారి అమెరికా ఫెడరల్ రిజర్వ్ వడ్డీ రేట్లలో కోత విధించే అవకాశం 70 శాతంగా ఉందని మార్కెట్ వర్గాలు అంచనా వేస్తున్నాయి. ఇదే జరిగితే సురక్షిత పెట్టుబడి సాధనమైన పసిడికి మళ్లీ డిమాండ్ పెరిగి ధరలకు రెక్కలొచ్చే అవకాశం ఉందని మార్కెట్ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

# పార్కిన్సన్స్ వ్యాధికి అసలు కారణమిదే..



**- ఆస్ట్రేలియా పరిశోధనలో కీలక విషయాల వెల్లడి**
**- మెదడులోని రక్తనాళాల్లో మార్పులే వ్యాధి తీవ్రతకు కారణం**
**- ప్రోటీన్ల కంటే రక్తనాళాల పాత్రే ఎక్కువని గుర్తింపు**
**- ఈ ఆవిష్కరణతో కొత్త చికిత్సలకు మార్గం సుగమం**

పార్కిన్సన్స్ వ్యాధిపై ఇప్పటివరకు ఉన్న అవగాహనను మార్చేసే కీలక ఆవిష్కరణను ఆస్ట్రేలియా పరిశోధకులు కనుగొన్నారు. ఈ వ్యాధి కారణంగా మెదడులోని రక్తనాళాల్లో తీవ్రమైన మార్పులు సంభవిస్తాయని, ఇదే వ్యాధి ముదరడానికి ప్రధాన కారణమని వారు తేల్చారు. ఈ పరిశోధన భవిష్యత్తులో పార్కిన్సన్స్‌కు కొత్త చికిత్సా మార్గాలను అందుబాటులోకి తెచ్చే అవకాశం ఉందని భావిస్తున్నారు. ఇప్పటివరకు పార్కిన్సన్స్‌కు మెదడులో ఆల్ఫా-సిన్యూక్లిన్ అనే ప్రోటీన్ పేరుకుపోవడమే కారణమని భావించేవారు. అయితే, ఆస్ట్రేలియాలోని న్యూరోసైన్స్ రీసెర్చ్ ఆస్ట్రేలియా సంస్థ తాజాగా విడుదల చేసిన ఒక ప్రకటన ప్రకారం, ప్రోటీన్ల కంటే మెదడులోని రక్తనాళాల్లో చోటుచేసుకునే మార్పులే వ్యాధి తీవ్రతలో కీలకపాత్ర పోషిస్తున్నాయని తేలింది. "సంప్రదాయకంగా పరిశోధకులు ప్రోటీన్లు, నరాల కణాల నష్టంపైనే దృష్టి పెట్టారు. కానీ, మేము మెదడులోని రక్తనాళాల వ్యవస్థపై దాని ప్రభావాన్ని చూపించగలిగాం" అని పరిశోధనలో కీలకపాత్ర పోషించిన డెర్యా డిక్ తెలిపారు. తమ అధ్యయనంలో మెదడులోని కొన్ని ప్రాంతాల్లో రక్తనాళాలు బలహీనపడటాన్ని, ముఖ్యంగా పనికిరాని రక్త కేశనాళికల అవశేషాలు (స్ట్రింగ్ వెస్సెల్స్) పెరగడాన్ని గుర్తించినట్లు డెర్యా వివరించారు. దీనివల్ల మెదడులో రక్త ప్రసరణ, బ్లడ్-బ్రెయిన్ బ్యారియర్ పనితీరులో కూడా మార్పులు వస్తున్నాయని కనుగొన్నారు.


# ఎస్సీల ఎదుగుదలకు అడ్డంకిగా క్రిమీలేయర్ !

ఎస్సీలలో క్రిమిలేయర్ విధానం అమలు చేయాలని ఇటీవల పదవీ విరమణ పొందేముందు భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బిఆర్ గవాయ్ చేసిన సూచన సమాజానికి ఓ హెచ్చరిక లాంటిది. రాజకీ య పార్టీలు దీనిపై చర్చించాలి. పార్లమెంట్ దీనిపై చర్చించాలి. ఎందుకంటే సామాజికంగా ఎస్సీలు అంతా అభ్యున్నతి చెందాలంటే ఇది అత్యావశ్యకం. అప్పుడే ఎస్సీలంతా ఉన్నతంగా ఎదుగుతారు. లేకుంటే రిజర్వేషన్లు ఎన్నేళ్లు పెట్టినా కొందరే తన్నుకుపోతారు. ఇది అమలు కాకపోవడం వల్ల కేవలం కొందరే రిజర్వేషన్ల లబ్ధిని పొందుతున్నారు. దీంతో గత 75 ఏళ్లుగా కొందరే ఉద్యోగ, రాజకీ య లబ్ది పొందుతూ వస్తున్నారు. వారి కుటుంబాలే సమాజాంలో వెలుగొందుతున్నాయి. పదవీ విరమణ పొందిన జస్టిస్ గవాయ్ దీనిని గట్టిగా సూచించి ఉంటే బాగుండేది. కేంద్రం కూడా ఎందుకో ఈ విషయంలో పట్టించుకోవడం లేదు. నిజానికి రిజర్వేషన్లను కొంతకాలం వరకే అమలు చేయాలి. ఒక కుటుంబం రిజర్వేషన్ల పొందిన తరవాత వారు ఉన్నతస్థానం చేరుకున్నాక వారిని క్రిమిలే యర్‌గా గుర్తించి, వారిని దూరం పెట్టాలి. ఉద్యోగాల్లో అయినా రాజకీయాల్లో అయినా ఇది చేసితీరాలి. ఇది లేకపోవడం వల్ల ఒకే కుటుంబానికి చెందిన వారు వారసత్వం గా రిజర్వేషన్ ఫలాలు పొందుతున్నారు. వెనకబడిన తరగతులు, షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూ ల్డ్ జాతులు, తెగలవారి మధ్యలో రాజ్యం ద్వారా ఈ రిజర్వేషన్ల విధానం సమానత్వం, ఏకరూప అభివృద్ధి సాధించ వలసి వుంది. ఇందుకు బదులుగా, రిజర్వేషన్లు పొందిన కొన్ని కులాలు, కుటుంబాలే మళ్లీ మళ్లీ పొందుతూ అసమానతలను, వెనకబడిన వారి మధ్య మరింత వెనకబడిన పరిస్థితులను సృష్టించాయి. రిజర్వేషన్ల అమలు విధానాల ప్రభావాలను సమీక్ష చెయ్యడంలో ఆయా ప్రభుత్వాలు అనుసరించిన అలక్ష్యం, అలసత్వాలు ఈ ఆంతరిక వ్యత్యాసాల పెరుగుదలకు ఉపకరించాయి. హోదాలు, జీతభత్యాలతో సహా, అన్ని రకాల సంపద అవకాశాలూ ప్రతి ఒక్కరికీ పంచాలని రాజ్యాంగం నిర్దేశిరచిన సంగతిని ఈ విద్యావంతులైన సంపన్నశ్రేణి మరువరాదు. సాంకేతిక అంశాలను, సమాజాన్ని గందరగోళంలోకి నెట్టే తప్పుడు వాదనలను, భయాలను, స్వార్థపూరిత దుష్ప్రచారాలను కొనసాగించవద్దు. ప్రతి కులానికీ, జాతికీ, తెగకూ రిజర్వేషన్లలో పంపిణీ న్యాయం జరగటానికి వీలుగా, ఉపవర్గీకరణ చేసి, హేతుబద్ధీకరించాలని నలభైఏళ్లపాటు దండోరా ఉద్యమం జరిగింది. వర్గీకరణ వ్యతిరేకవాదులు ఆటంకాలు కల్పించి, చివరకు ఓడిపోయారు. ఇలా జరక్కుండా, అత్యంత వెనకబడిన అణగారిన కుటుంబాలకు, సమూహాలకు ప్రాధాన్యతలతో కూడిన ప్రాతినిధ్య న్యాయం కల్పించడానికి ఇప్పుడు సంపన్న శ్రేణిలో చేరిన వారు ప్రగతిశీల దృక్పథంతో క్రీమీలేయర్ అమలును స్వాగతించాలి. అగ్రకులాల వారిని విమర్శిస్తున్న వారు ఈ క్రిమిలేయర్ గురించి మాట్లాడడం లేదు. ముఖ్యంగా దళితుల్లో చైతన్యం రావాలి. వారే రిజర్వేషన్ను క్రమబద్ధీకరించే విషయంలో పోరాడాలి. అప్పుడే అస్సు రిజర్వేషన్లు పొందని వారికి న్యాయం జరగగలదు. ఉదాహరణకు ఒకుటుంబం తరాలుగా రిజర్వేషన్లను అనుభవిస్తోంది. వారు ఉన్నత స్థానానికి ఎదిగారు. పారిశ్రామిక వేత్తులుగా రాణిస్తున్నారు. ఇలా అనేకులు ముందు ఉన్నారు. కేవలం వీరిని ఉదాహరణగా చూపడం తప్ప వీరిగురించి వేరే ఉద్దేశ్యంతో కాదు.

పన్న శ్రేణిఅంటే క్రీమీలేయర్ విధానం ఎస్సీలలో ప్రవేశపెట్టడం అత్యంతావశ్యకం. జస్టిస్ గవాయ్ చేసిన సూచన ఇప్పుడు దేశవ్యాప్తంగా చర్చ కావాలి. ఎస్సీల్లో ఉపకులాల రిజర్వేషన్ల కోసం ఉద్యమించినట్లుగానే క్రిమిలేయర్ కోసం కూడా దళితులే ఉద్యమించాలి. ఈ డిమాండ్ చాలాకాలంగా ఉంది. అయితే విద్య, ఉద్యోగ రంగాల్లో రిజర్వేషన్ల ద్వారా అత్యధికంగా లబ్దిపొందిన ఎస్సీలు దీనిని వ్యతిరేకిస్తున్నారు. ఇది సరికాదు. ఎస్సీ వర్గీకరణ అనుకూల ఎస్సీ మేధావులు దీనిపై చర్చించాలి. ఈ సంపన్నశ్రేణి విధానం దగ్గరికి వచ్చేసరికి, ప్రగతి నిరోధకంగా వ్యవహరిం చడం సరికాదు. ఆధిపత్య కులాల వారి సంపదలకు ఏ విధమైన పరిమితులూ విధించనప్పుడు, తమకు మాత్రం ఈ సంపన్న శ్రేణి విధానం వర్తింపజేయాలని కోర్టులు, ప్రభుత్వాలు ఆలోచించడం అన్యాయం అని కొందరు వాదిస్తున్నారు. అయితే ఇక్కడ ఎస్సీలది సమస్య ఆర్థిక సమస్య కాదు, సామాజిక సమస్య. రాజ్యాంగం ప్రసాదించిన రిజర్వేషన్ ఫలాలు అందరికీ అందాల్సిన తరుణంలో కొందరే అనుభవించడం సరికాదు. ఎస్సీల్లో కొందరు మాత్రమే రిజర్వేషన్ల ఫలాలు పొంది ఆర్థికంగా బాగుపడినప్పటికీ, కులపరంగా మిగతా వారు వేదనకు గురవుతున్నారు. ఇదో రకంగా ఎస్సీల్లో దొరతనానికి పరాకష్టగా చూడాలి. ఎస్సీలో కొందరు పెద్ద దొరలు తయారవుతున్నారు. రిజర్వేషన్ల ఫలాలతో ఎదిగిన ఈ వర్గాల్లో చాలామంది అభివృద్ధి చెందిన ఇతర కులాలతో అంటకాగుతూ, తమ వర్గాలను విస్మరిస్తున్నారు. ఈ కారణంగా 90శాతం మిగతా ఎస్సీల్లో ఇప్పటికీ ఆధిపత్య కులాల సంపన్నులతో పోటీపడలేకపోతున్నారు. రిజర్వేషన్ల ద్వారా లబ్దిపొందిన వారే మళ్లీ మళ్లీ అవకాశాలు అందుకుంటూ తమ వారికి అడ్డుగా మారుతున్నారు. డబ్బు సంపాదనలో ముందున్న కొందరు తమ వర్గంలోని మిగతావారిని పైకి తీసుకుని రాలేకపోతున్నారు. సంపన్నశ్రేణిని గుర్తించి సరిచేయడం ద్వారానే ఈ సమస్యకు పరిష్కారం చూపగలం. అలాగే రిజర్వేషన్లు ఎల్లకాలం అనుభవించే హక్కునుంచి వీరిని దూరం చేయాల్సింది. భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బి.ఆర్. గవాయ్ ఓ కార్యక్రమంలో మాట్లాడుస్తూ రిజర్వేషన్ల దగ్గరికి వచ్చినపుడు ఒక ఐఏఎస్ అధికారి సంతతిని,ఒక పేద వ్యవసాయ కూలీ సంతతిని సమానంగా చూడరాదని అన్నారు. ఇది వాస్తవం. నిజానికి రిజర్వేషన్ల నిచ్చెనలు ఎక్కినఎందరో మిగతా ఎస్సీల అభ్యున్నతికి పాటుపడుతున్న దాఖలాలు లేవు. ఒక కుటుంబానికి ఒకటి రెండుసార్లే రిజర్వేషన్లు అమలు కావాలి. అప్పుడే ఎస్సీలు సామాజికంగా ఎదుగగలరు.

## మృతుని కుటుంబానికి రు. 50 లక్షలు, ఉద్యోగం ఇవ్వాలి

జయశంకర్ భూపాలపల్లి: జయశంకర్ భూపాలపల్లి మున్సిపాలిటీ కార్యాలయం ఎదుట పారిశుద్ధ్య కార్మికుల నిరసనకు తెలంగాణ రాజ్యాధికార పార్టీ జిల్లా అధ్యక్షుడు రవి పటేల్ మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా రవి పటేల్ మాట్లా డుతూ, పారిశుద్ధ్య కార్మికుడు బొల్లి రాజయ్య పని సమయంలో అనుమానాస్పద స్థితిలో మృతి చెందారని, పని ఒత్తిడి కారణమని కుటుంబ సభ్యులు చేసిన ఆరోపణలు అత్యంత గంభీరమని పేర్కొ న్నారు. మృతుని కుటుంబానికి రు.50 లక్షల ఎక్స్గ్రేషియా, కుటుంబ సభ్యులకు ఉద్యోగాలు వెంటనే ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ ఘటనకు బాధ్యులైన అధికారులను ఉద్యోగాల నుండి తొలగించడంతో పాటు, కలెక్టర్, ఎమ్మెల్యే, మున్సిపల్ కమిషనర్ బాధ్యత తీసుకొని కుటుంబానికి న్యాయం చేయాలని కోరారు. డిమాండ్లు నెరవేరనిచో పెద్ద ఎత్తున నిరసనలకు దిగుతామని హెచ్చరించారు. భూపాలపల్లి మున్సిపాలిటీ కార్మికులకు ఉద్యోగ భద్రత, హెల్త్ కార్డులు, ఇందిరమ్మ/డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లు, అలాగే సేఫ్టీ కిట్లు, శానిటైజింగ్ సామగ్రి, యూనిఫామ్‌లు సకాలంలో అందించాలని, వేతనాలు పెండింగ్ కాకుండా విడుదల చేయాలని రవి పటేల్ డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నేతలు అనంతుల సంపత్, ఇనుగాల ప్రణీత్, గట్టు శ్రీకాంత్ పాల్గొన్నారు.



# తగ్గిన భూముల ధరలు...

## కొనేందుకు 'నో' చెబుతున్న రియల్టర్లు..



**నిజామాబాద్,తెలంగాణ దిశ :**కామారెడ్డి జిల్లాలో 'భూమ్' దందా ఒక్కసారిగా విలవిలా పడింది. ఏడాది క్రితం అత్యధిక ధరలతో అమ్ముడుపోయిన భూముల అమాంతంగా పడిపోవడంతో రియల్ వ్యాపారులు ఆర్థికంగా చతికిలబడ్డారు. మధ్యవర్తితంగా కొనుగోలు చేసిన భూములు అమ్ముడుపోకపోవడంతో తీవ్ర నష్టాలను ఎదుర్కొంటున్నారు. ఏడాది క్రితం కోట్ల లోపలికిన భూముల ధర ప్రస్తుతం 40 శాతానికి తగ్గిపోవడంతో అనుకోవాలంటే అసలుకే నష్టం వస్తుందన్న ఆందోళన కలుగుతోంది.వ్యవసాయ భూములే కాకుండా ప్లాట్ల ధరలు కూడా తగ్గుముఖం పట్టడంతో రియల్ వ్యాపారులు తమ దందాను మూసుకునే పరిస్థితి ఏర్పడింది. మరి కొందరు వ్యాపారులైతే వడ్డీలు కట్టలేక ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారు. గతంలో జోరుగా సాగిన భూమ్ దందాతో ఆర్థికంగా బాగా స్థిరపడ్డ వ్యాపారులు తాజా పరిస్థితులతో కూడబెట్టుకున్న సొమ్మును వదులు కునే దుస్థితి ఏర్పడింది.టిఆర్ఎస్ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు భూముల ధరలు అమాంతంగా ఆకాశానంటాయి. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక భూముల ధరలపై తీవ్ర ప్రభావం పడింది. ధరలు తగ్గుముఖం పట్టడంతో భూములు ప్లాట్లు అమ్ముకునేవారు ముందుకు రాకపోవడంతో రియల్ వ్యాపారానికి బ్రేక్ పడింది.కామారెడ్డి జిల్లా కేంద్రంతో పాటు బాన్సువాడ ఎల్లారెడ్డి పిట్లం బీర్కూర్ మదనూర్ జుక్కల్ ప్రాంతాల్లో భూముల ధరలకు రెక్కలు వచ్చాయి. ఎకరం భూమి కోటి రూపాయలకు పైగా ధర పలుకుతుంది. ప్లాట్ల ధరలైతే గజానికి పదివేల నుండి 25 వేల రూపాయల వరకు ధర పలుకుతుంది. రోడ్ సైడ్ ప్లాట్ లకు ధర ఊహించే విధంగా పెంచేస్తున్నారు. పట్టణాలు మండల కేంద్రాలు ది నదినాభివృద్ధి చెందడంతో స్థలం ధరలు కూడా అడ్డగోలుగా పెరుగుతూ వస్తున్నాయి.ఆర్థికంగా పరిపుష్టి ఉంటే తప్ప వ్యవసాయ భూములు, ప్లాట్లు కొనుగోలు చేసే పరిస్థితి లేదు. మరికొన్ని చోట్ల గతంలో ఉన్న ధరలు ప్రస్తుతం కనిపించడం లేదు. ఒక్కసారిగా భూముల ధరలు పడిపోవడంతో అక్కడి వాసులు జాగల నమ్ముకోవాలంటేనే వెనుకడుగు వేస్తున్నారు. పట్టణాల వైశాల్యం పెరుగుతుం డడం సమీప గ్రామాలను పట్టణంలో చేర్చడంతో జాగా ధర లక్షల నుండి కోట్లలోకి పెరిగి పోయింది. జిల్లాలో ఎల్లారెడ్డి బాన్సువాడ మున్సిపాలిటీగా మారడంతో భూముల ధరలపై ప్రభావం పడింది.ఫలితంగా భూముల అమ్మకాలు కొనుగోలు పూర్తిగా తగ్గుముఖం పట్టాయి. పదిమంది కలిసి రియల్ వ్యాపారంలో పెట్టుబడులు పెట్టేవారు. భూములను ప్లాట్లను కొనుగోలు చేసేటప్పుడు నామమాత్రంగా అడ్వాన్సులు చెల్లించి అట్టి వాటిని అధిక ధరలకు అమ్ముకొని సొమ్ము చేసుకునేవారు. వచ్చిన లాభాన్ని పదిమంది సమానంగా పంచుకునే పరిస్థితి ఉండేది. దీంతో రియల్ వ్యాపారం కొంతకాలం వరకు దండిగా నడిచింది. భూముల ధరలు ఆకాశాన్ని అంటడంతో విక్రయించేందుకు సిద్ధంగా ఉన్న కొనుగోలు చేసేందుకు ఎవరు ముందుకు రాకపోవడంతో మిన్నకుండు పోవాల్సి వస్తుంది.రియల్ దందాకు అడ్డు కట్టబడడంతో వ్యాపారాన్ని మానుకొని పరిస్థితి నెలకొందని పలువురు రియల్ వ్యాపారులు ఆవేదన వ్యక్తం చేశారు. పలుచోట్ల కొనుగోలు చేసిన భూములు ప్లాట్లు కూడా అమ్ముడుపోకపోవడంతో చేసిన అప్పులకు వడ్డీలు తడిసీమొపై రియల్ వ్యాపారులు ముఖం చాటిసి పరిస్థితి కూడా నెలకొంది. మరికొందరైతే ఈ దందాలో ఇరుక్కుపోయి అరసత్వంగా వచ్చిన భూములు జాగాలను కూడా అమ్ముకొని అప్పులు కట్టే పరిస్థితి కూడా దాపరించింది.రియల్ వ్యాపారం కుదరవడంతో రిజిస్ట్రేషన్లు సైతం తగు ముఖం పట్టాయి. భూముల కొనుగోలు అమ్మకాలు లేకపోవడంతో రియల్ వ్యాపారులతో సందడిగా కనిపించే రిజిస్ట్రేషన్ ఆఫీసులు వేలవేల బోతున్నాయి. రియల్ వ్యాపారం జోరుగా సాగే రోజుల్లో కార్యాలయాలు కిక్కిరిసి కనిపించేవి. రిజిస్ట్రేషన్ల కోసం క్రయవిక్రియ దారులు కార్యాలయాల ముందు పడిగాపులు కాచి స్థితి ఉండేది. ప్రస్తుతం భూము లు ధరల ప్రభావం పడడంతో సామాన్యులు కొనుగోలు చేసేందుకు జంకుతుండడంతో రిజిస్ట్రేషన్ శాఖ అధికారులకు బిజీ తగ్గింది.జరుగుతున్న క్రయవిక్రయాలకు కొన్ని మాత్రమే రిజిస్ట్రేషన్లు జరుగుతున్నాయని చెబుతున్నారు. ఇంతకుముందు 50 కి పైగా రిజిస్ట్రేషన్లు జరిగేవని, పది రిజిస్ట్రేషన్లు జరగాలంటేనే కష్టంగా ఉన్నట్లు వాపోతున్నారు. డాక్యుమెంటరీ ఫీజు, రిజిస్ట్రేషన్ ఫీజు తో కలిపి భారీగానే సొమ్ము సమకూరేది. అత్యధికంగా రెవిన్యూ అందించే శాఖ కార్యకలాపాలు తగ్గుముఖం పట్టడంతో ప్రభుత్వానికి, భారీగానే గండి పడుతుంది.

## యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

### ఎక్సైజ్ ఎస్సై రాకేష్ కుమార్



**కమాన్ పూర్,తెలంగాణ దిశ :** యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని మంథని ప్రొహిబిషన్ మరియు ఎక్సైజ్ సిఐ ఏ రాకేష్ కుమార్ అన్నారు. కమాన్ పూర్ జిల్లా పరిషత్ పాఠశాల మరియు గుండారం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మత్తు పదార్థాలపై అవగాహన విద్యార్థులకు నిర్వహించారు. నేడు 18 సంవత్సరాల నుండి 30 సంవత్సరాల లోపు విద్యార్థులు యువకులు డ్రగ్స్ కు ఆకర్షితులయ్యే అవకాశం ఉందని డ్రగ్స్ కు దూరంగా ఉండాలని ఆయన పేర్కొన్నారు. డ్రగ్స్ వ్యసనం అనేది మన జీవితాన్ని నాశనం చేస్తుందని పేర్కొన్నారు. ముఖ్యంగా విద్యార్థులు అటువంటి అలవాటులకు పోకుండా శ్రద్ధగా చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని అన్నారు. ముఖ్యంగా మన ఆరోగ్యాన్ని,మానసికంగా ఎన్నో అనర్థాలు వస్తాయని పేర్కొన్నా రు. మద్యానికి దూరంగా ఉండాలని గంజాయి వంటి వాటి జోలికి పోకూడదని పేర్కొన్నారు. గంజాయి అమ్మకాలు చేస్తే కఠిన చర్యలు తప్పవని దీంతో జైల్ జీవితాలు గడపాల్సి వస్తుందని పేర్కొన్నారు. డ్రగ్స్ కేసులో పట్టుబడిన వారికి సుమారు 10 సంవత్సరాల నుండి 20 సంవత్సరాలు జైలు శిక్ష రెండు లక్షల రూపాయలు జరిమానా విధించడం అవుతుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో సబ్ ఇన్స్పెక్టర్ సాయికుమార్ డిస్ట్రిక్ట్ టాస్క్ ఫోర్స్ ఎస్ ఐ కే పావని మరియు కళాశాల పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

# కొనలేం.. తినలేం

### కొండెక్కిన కూరగాయల ధరలు.. వంటింట్లో కుతకుత
### మొంథా తుపాను, వర్షాలతో దెబ్బతిన్న పంటలు
### తగ్గిన దిగుబడి.. ఇతర రాష్ట్రాల నుంచి దిగుమతులే దిక్కు
### కేజీ రూ.80 చేరిన ధరలు



**పటాన్‌చెరు,తెలంగాణ దిశ :** కూరగాయల ధరలు కొండెక్కడంతో వినియోగదారులు బెంబేలెత్తుతున్నారు. ఏ కూరగాయ ధర చూసినా భగ్గుమంటున్నది. దీంతో కొన లేం.. తినలేం అన్నట్లుగా పరిస్థితి మారింది. కొద్దిరోజులుగా జిల్లాలో కూరగాయల ధరలు విపరీతంగా పెరిగాయి. నవంబర్‌లో సాధారణంగా కూరగాయల ధరలు తకువగా ఉంటా యి. కానీ, వరు స వర్షాలు, మొంథా తుపాన్‌తో భారీగా కూరగాయల పంటకు నష్టం జరిగింది. దిగుబడి సైతం బాగా తగ్గింది. ఇతర రాష్ట్రాల నుంచి దిగుమతి చేసుకోవడంతో ఖర్చులు పెరిగాయి.ఏ కూరగాయ చూసినా కిలో రూ.80-100 వరకు పలుకుతున్నది. పేద, మధ్యతరగతి ప్రజలు తీవ్ర ఆర్థిక ఇబ్బం దులు ఎదుర్కొంటున్నారు. తుపాను ముందు టమాటా కేజీ రూ.20 నుంచి రూ.40 రూపాయలు ఉండేది. ఇప్పుడు రూ. 50 నుంచి 60 ధర పలుకుతున్నది. టమాటా లేనిదే ఏ వంట చేసుకోని పరిస్థితి. దీంతో తప్పనిసరిగా కిలో కొనేవారు అరకిలో కొని సరిపెట్టుకుంటు న్నారు. ఆకుకూరల ధరలు సైతం ఆకాశాన్ని అంటాయి. పటాన్‌చెరు లో, న్యాల్‌కల్, హద్నూర్ సంతల్లో టమాటా కిలోకు రూ.60 ఉండగా, బెండకాయ-రూ.80, పచ్చిమిర్చి-రూ. 100, బీరకాయ-రూ.80, అల్లంవెల్లి గడ్డ-రూ.120, క్యారెట్ రూ.100, బీట్‌రూట్ రూ.100, వంకాయ రూ.110, గోబీ రూ. 80 ధర పలుకుతున్నాయి. పాలకూర, గోంగూర, మెంతికూర వంటి ఆకుకూరలు సైతం కిలో రూ.40-50కి చేరాయి. మిగిలిన కూరగాయల ధరలు ఇంచుమించు రూ.40-80 మధ్య పలుకుతున్నాయి. పెరిగిన కూరగాయల ధరతో ఏం కొనేటట్టు లేదు ఏం తినేటట్టు లేదు అంటూ బాధపడాల్సిన రోజులొచ్చాయని ప్రజలు వాపోతున్నారు. క్యారెట్,బీన్స్,క్యాప్సికం వంటి కొన్ని కూరగాయలు కేజీ రూ. 120, రూ.150లు కూడా దాటుతున్నాయని వినియోగదారులు వాపోతున్నారు. పెరిగిన రేట్లతో రూ.500లు పెట్టినా మూడు రోజులకు సరిపోయే కూరగాయలు రావడం లేదు. సంగారెడ్డి జిల్లాలో తుపాను, వర్షాలతో కూరగాయల పంటలు దెబ్బతిని, దిగుబడి తగ్గింది. సాగు సైతం కొద్దిరోజులుగా తగ్గింది. దీంతో మహారాష్ట్ర, కర్ణాటక, ఏపీ నుంచి ప్రధాన పట్టణాలకు దిగుమతి చేసుకుంటున్నారు. దీంతో రవాణా ఖర్చులు పెరగడంతో ధరలు పెరిగాయని కూరగాయల వ్యాపారులు చెబుతున్నారు. కార్తిక మాసంలో నాన్‌వెజ్‌కు డిమాండ్ తగ్గి, కూరగాయల వినియోగం పెరగడంతో సైతం ధరలు పెరిగాయని వ్యాపారులు చెబుతున్నారు. కొంతకాలంగా కూరగాయల సాగుకు ప్రభుత్వ ప్రోత్సహించక పోవడంతో సాగు తగ్గింది. యాసంగి సీజన్ ప్రారంభమై నెలరోజులు అవుతున్నా, కూరగాయల సాగుకు ఉద్యానశాఖ నుంచి అవసరమైన ప్రోత్సాహం అందడం లేదని రైతులు చెబుతున్నారు. యాసంగి పంట చేతికి వస్తే మరో మూడు వారాల్లో కొంత వరకు ధరలు దిగివస్తాయని వ్యాపారులు పేర్కొంటున్నారు.

# సిటీ బస్సులకు హైడ్రాలిక్ డోర్స్...



**హైదరాబాద్,తెలంగాణ దిశ :**బస్సుల్లో ఫుట్‌బోర్డు ప్రయాణాలకు చెక్ పెట్టేందుకు టీజీఎస్‌ఆర్టీసీ కొత్త ఎలక్ట్రిక్ బస్సుల్లో హైడ్రాలిక్ ఆటోమేటిక్ డోర్లు తెచ్చింది. బస్సు ఆగితేనే డోర్లు తెరుచుకుంటాయి, కదులుతుంటే ఆటోమేటిక్‌గా మూసుకుంటాయి. ముఖ్యంగా విద్యార్థుల భద్రత కోసం ఈ వినూత్న మార్పులు చేశారు. ఈ కొత్త బస్సులు ప్రమాదాలను తగ్గించి, ప్రయాణాన్ని సురక్షితంగా మారుస్తాయని అధికారులు ఆశిస్తున్నారు.హైలైట్:ఫుట్‌బోర్డు ప్రయాణాలు, ప్రమాదాలకు చెక్బస్సుల్లో ఫుట్‌బోర్డు ప్రయాణాలు, కదులుతున్న బస్సుల నుంచి దిగడం వంటి ప్రమాదకర విన్యాసాలకు అడ్డుకట్ట వేసేందుకు తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ వినూత్న మార్పులు చేపట్టింది. ప్రయాణికుల, ముఖ్యంగా విద్యార్థుల భద్రతను దృష్టిలో ఉంచుకుని కొత్తగా ప్రవేశపెడుతున్న ఎలక్ట్రిక్ బస్సుల్లో అత్యాధునిక హైడ్రాలిక్ ఆటోమేటిక్ డోర్ వ్యవస్థను ఏర్పాటు చేస్తోంది. స్టేజీ వద్ద బస్సు పూర్తిగా ఆగినప్పుడు మాత్రమే ఈ డోర్లు తెరుచుకుంటాయి. బస్సు కదులుతున్నప్పుడు లేదా వేగంగా ఉన్నప్పుడు ఇవి ఆటోమేటిక్‌గా మూసుకుని లాక్ అవుతాయి. దీనివల్ల ప్రయాణికులు పరిగెత్తుకుంటూ వచ్చి బస్సు ఎక్కడం, కదులుతున్న బస్సు నుంచి దిగిపోవడం లేదా ఫుట్‌బోర్డుపై వేలాడటం కుదరదు. ఈ వ్యవస్థ విమానాశ్రయ బస్సులు (ఏసీ ఇంద్ర), హైఎండ్ డీలక్స్ బస్సుల్లో ఉండే సాంకేతికత తరహాలో పనిచేస్తుంది.

యినగరంలో జరిగిన ప్రమాదాలపై ఆర్టీసీ అధికారులు లోతుగా అధ్యయనం చేశారు. ఎక్కువ ప్రమాదాలు ఫుట్‌బోర్డు ప్రయాణాల వల్లే జరుగుతున్నాయని గుర్తించిన అధికారులు, ప్రమాద తీవ్రత ఎక్కువగా ఉన్న మార్గాలపై దృష్టి సారించారు. ప్రయోగాత్మకంగా హయత్‌నగర్-2 డిపో పరిధిలో 45 'గ్రీన్ మెట్రో ఎక్స్‌ప్రెస్' ఎలక్ట్రిక్ బస్సులను సిద్ధం చేశారు. ప్రస్తుతం 10 బస్సులు ఇప్పటికే రోడ్డెక్కాయి. ముఖ్యంగా విద్యార్థులు అధికంగా ప్రయాణించే హయత్‌నగర్, ఇబ్రహీంపట్నం మార్గాల్లో ఈ హైడ్రాలిక్ డోర్ వ్యవస్థ ఉన్న బస్సులను అందుబాటులోకి తీసుకొచ్చారు. హకీంపేట కేంద్రంలో శిక్షణ పూర్తి చేసుకున్న డ్రైవర్లు రాగానే.. మిగిలిన 35 బస్సులు కూడా త్వరలో తిరగనున్నాయి. డిసెంబరు నాటికి మరిన్ని ఈ-బస్సులు ఈ మార్గాల్లో అందుబాటులోకి వస్తాయని అధికారులు తెలిపారు.ఈ కొత్త ఎలక్ట్రిక్ బస్సులు ఒక్కొక్కటి సుమారు 60 మంది ప్రయాణికులు సౌకర్యవంతంగా కూర్చుని లేదా నిలబడి ప్రయాణించేలా రూపొందించబడ్డాయి. వీటి ద్వారా ఆక్యుపెన్సీ పెరుగుతుందని డిపో అధికారులు ఆశాభావం వ్యక్తం చేశారు. మేడ్చల్ ? సికింద్రాబాద్, సికింద్రాబాద్ ? దిల్‌సుఖ్‌నగర్, సికింద్రాబాద్ ? ఉప్పల్, కోఠి ? రామంతాపూర్, మెహిదీపట్నం ? ఆరాంఘర్, ఎల్బీనగర్ ? ఇబ్రహీంపట్నం, ఉప్పల్ ? ఘట్‌కేసర్ మార్గాల్లో విద్యార్థులు భారీ సంఖ్యలో రాకపోకలు సాగిస్తారు. కాబట్టి ఇక్కడ ఈ కొత్త బస్సులను అత్యధిక సంఖ్యలో ప్రవేశపెట్టడం ద్వారా ప్రమాదాలను గణనీయంగా అరికట్టవచ్చునని అధికారులు భావిస్తున్నారు. ఈ కొత్త భద్రతా చర్యల వల్ల ఫుట్‌బోర్డు ప్రమాదాలు తగ్గుతాయని.. ప్రయాణం సురక్షితంగా మారుతుందని ఆర్టీసీ ఆశాభావం వ్యక్తం చేస్తోంది.

# స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ తప్పదా



**విశాఖపట్టణం,తెలంగాణ దిశ :**ఆంధ్రప్రదేశ్ లో స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ అంశం మరోసారి తెరపైకి వస్తోంది. ఎన్ని వేల కోట్లు తెచ్చిపోసినా లాభాలు రాకుండా తెల్లఏనుగులా మారితే ఎంత కాలం అని భరిస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు నేరుగా వ్యాఖ్యానించడం చర్చనీయాంశమ వుతోంది. సీఐఐ పార్ట్‌నర్‌షిప్ సమ్మిట్ ముగింపు సమయంలో మీడియాతో మాట్లాడిన చంద్రబాబు, ప్లాంట్‌ను 'వైట్ ఎలిఫెంట్' అని, ఉద్యోగులు 'ఇంట్లో కూర్చొని జీతాలు తీసుకుంటు న్నారు' అని విమర్శించారు. "ప్రభుత్వం ఎప్పటికీ డబ్బు ఇస్తుందా? ఉద్యోగులు కష్టపడి పని చేసి లాభాలు తెచ్చి, ప్రైవేటీకరణకు అడ్డుకట్ట వేయాలి" అని అన్నారు. ఈ మాటలు ప్రైవేటీకరణకు ముందస్తు సంకేతమా అనే చర్చకు కారణమయ్యాయి.వైజాగ్ స్టీల్ ప్లాంట్ గత కొన్ని సంవత్సరాలుగా నష్టాల్లో మునిగిపోయింది. 2024లో రూ.4,000 కోట్లు నష్టం వచ్చింది. ప్రైవేటీకరణ చేయడానికి అన్ని ఏర్పాట్లు చేసి ఆపేసింది. కేంద్రం రఇచ్?చన ప్యాకేజీతో ప్లాంట్ బతికిందని ఇక ప్రైవేటీకరణ లే లేనట్లేనన్నారు. కానీ ఆ తర్వాత కూడా స్టీల్ ప్లాంట్ పరిస్థితి మెరుగుపడలేదు. ఉద్యోగులు పని చేయడం లేదన్న నివేదికలు ఉండటంతోనే చంద్రబాబు ఇలా వ్యాఖ్యానించారని చెబుతున్నారు. ఆ అనుమానాలను నిజం చేస్తూ.. ఉత్పత్తి ఆధారితంగా జీతాలు చెల్లిస్తామన్న ఉత్తర్వులు స్టీల్ ప్లాంట్ యాజమాన్యం జారీ చేసింది. నవంబర్ జీతాలు ప్రొడక్షన్ టార్గెట్‌లకు లింక్ చేశారు. ఇది ఉద్యోగుల్లో భయాన్ని మరింత పెంచింది.చంద్రబాబు ప్లాంట్‌ను ప్రొఫెషనల్‌గా నడపాలని కోరుతున్నారు. ఉద్యోగులు కష్టపడాలని చెప్పడం మేనేజ్‌మెంట్ సంస్కరణలకు సంకేతం అనుకోవచ్చు. కేంద్ర ప్యాకేజీతో ప్రైవేటీకరణ ఆగిపోయింది కానీ.. ఎలా ఎప్పటికీ గాడిన పడకుండా.. నష్టాలు వస్తూంటే..ఎప్పటికప్పుడు నిధఉలు తెచ్చి పూడుస్తారని అర్థం కాదని చంద్రబాబు నేరుగా చెబుతున్నారు. ప్రైవేటు కంపెనీలు పెద్ద ఎత్తున లాభాలు సంపాదిస్తూంటే అన్ని వనరులు ఉండి కూడా ఎందుకు స్టీల్ ప్లాంట్ కు లాభాలు రావడం లేదని చంద్రబాబు ప్రశ్నిస్తున్నారు. అయితే చంద్రబాబు మాటల్ని విపక్షాలు, యూనియన్లు దీన్ని 'ప్రైవేటీకరణకు మార్గం'గా చూస్తున్నాయి. ప్లాంట్‌కు క్యాప్టివ్ మైన్స్ లేకపోవడం వల్లే నష్టాలు వస్తున్నాయని వారంటున్నారు. వాలంటరీ రిటైర్మెంట్ స్కీమ్ ఉద్యోగులను తొలగిం చాలనే ప్లాన్ కూడా చేస్తున్నారని ఉద్యోగ సంఘాలు అనుమానిస్తు న్నాయి. ప్లాంట్ లాభాల్లోకి వస్తే మాత్రమే ప్రైవేటీకరణ ఆగుతుంద న్నట్లుగా చంద్రబాబు మాటలు ఉన్నాయి. అదే పనిగా నష్టాలు వస్తూంటే.. కేంద్రం కూడా నిధులు ఇవ్వదు. అనకాపల్లి జిల్లాలో ఆర్సెలార్ మిట్టల్ లక్షన్నర కోట్లతో ప్లాంట్ పెట్టేందుకు ముందుకు వస్తోంది.

# విరుచుకుపడుతున్న వివక్ష భూతం..!



సోదరభావం, సమానత్వం దిశగా, అభివృద్ధి పథంలో దేశ ప్రజలు అడుగులు వేయాలని సాధించుకున్న స్వాతంత్ర్య స్ఫూర్తి మసకబారే ధోరణి ఈమధ్య కాలంలో బాగా పెరిగిపోయింది. చిన్న పల్లె నుంచి దేశ రాజధాని వరకూ కుల, మత వివక్ష భూతం విరుచుకు పడుతోంది. ఇది ఆందోళనకరం. ఇటీవల హర్యానాలో ఐపిఎస్ కేడర్ వ్యక్తి కులం పేరుతో ఉన్నతాధికారులు పెట్టే అవమానాలు తట్టుకోలేక ఆత్మహత్య చేసుకున్నారు. అతని భార్య ఓ ఐఎఎస్ అధికారి. ఆ సమయంలో ఆమె ప్రభుత్వ ప్రతినిధిగా ముఖ్యమంత్రితో పాటు విదేశీ పర్యటనలో ఉన్నారు. తిరిగి వచ్చిన ఆమె భర్త మరణానికి కారణమైన అధికారుల పేర్లు సైతం వెల్లడించారు. మరణించిన అధికారి సూసైడ్ నోట్‌లో కూడా వారి పేర్లు ఉన్నాయి. అయినా వాళ్లమీద ఏవిధమైన చర్యలూ తీసుకోలేదని ఆమెవాపోయారు. ఒక ఉన్నతాధికారి కుటుంబమే కుల వివక్షకి ఇంతలా తల్లడిల్లుతుంటే ఇక సామాన్య ప్రజల పరిస్థితి ఏంటి? 'బ్రాహ్మణులని పూజిస్తాం..' అనిపించారు.అక్టోబరు నెల ప్రారంభంలో మధ్యప్రదేశ్‌లో జరిగిన ఓ ఘటన ప్రజాస్వామ్యాన్ని, నాగరిక సమాజాన్ని పరిహాసం చేసేదిగా ఉంది. సోషల్ మీడియాలో వైరల్ అయిన సమాచారం ప్రకారం.. 'ఒబిసి వర్గానికి చెందిన ఓ యువకుడు, ఉన్నతవర్గానికి చెందిన యువకుడి కాళ్లు కడిగి, నెత్తిన జల్లుకున్నాడు. ఆతరువాత 'బ్రాహ్మణులని అవమానించినందుకు నేను క్షమాపణలు చెబుతున్నా. ఇంకెప్పుడూ ఈ తప్పు జరగదు. ఇకమీద మేమంతా బ్రాహ్మణులని ఈవిధంగానే పూజిస్తాం' అన్నది ఆ వీడియో సారాంశం. ఎంత దిక్కుమాలిన చర్య ఇది! కులం పేరుతో సాటి మనిషిని ఇంతలా అవమానించడం దేనికి సంకేతం?వేరే కులం వారిని ఇష్టపడినందుకు, పెళ్లిచేసుకున్నందుకు కన్నవారే హంతకులుగా మారిపో తున్న ఘటనలు ఎన్నో చూస్తున్నాం. అయితే పై ఘటనలు వీటికి పూర్తిగా భిన్నమైనవి. సమాజంలో వెనుకబడిన వర్గాల వారిని సాటి మనుషులుగా కూడా గుర్తించని భావజాలానికి నిదర్శనం అవి. సదరు వ్యక్తులు ఉన్నత హోదాలో ఉన్నాసరే ఆ సంకుచిత్వం ఏదోవిధంగా బయటపడుతూనే ఉంటోంది. సిజెఐపై దాడి అటువంటిదే. 'దేవుడే నన్ను ఈ పని చేయమన్నా'డు.. అని ప్రకటించారు. సుప్రీంకోర్టులో జరిగిన ఘటనలో న్యాయవాది రాకేష్ కిషోర్, సిజెఐ గవారుపై బూటు విసిరే ప్రయత్నం చేస్తూ 'సనాతన ధర్మాన్ని అవమానిస్తే భారతదేశం సహించదు' అన్నారు. ఇంకా 'దేవుడే నన్ను ఈ పని చేయమన్నాడ'ని ప్రకటించారు. ఇంత అక్కసువెళ్లగక్కడంవెనుక సిజెఐ సామాజిక నేపథ్యం కూడా ఒక కారణమేననివిశ్లేషణలు వచ్చాయి. పదవి చేపట్టిన నాటినుండి గవారు పలు సందర్భాల్లో 'ఇది భారతదేశం.. దేశంలో రాజ్యాంగ అమలుని సహించని మనువాదకులకి ఇది మింగుడుపడని చర్య. అనుమానంతోనే చంపేశారు..ఇటీవల రాయ్ బరేలీలో జరిగిన ఓ దుర్ఘటన కూడా కుల వివక్షని ఎత్తిచూపుతోంది. దొంగతనం చేయకుండనే, చేస్తాడేమో నన్న నెపంతో షెడ్యూల్ కులానికి చెందిన ఓ యువకుడిని అగ్రవర్ణానికి చెందిన ఓ గుంపు కొట్టి చంపింది. అక్కడ ఇంకా దొంగతనం జరగలేదు.

# యూఎస్‌లో లక్షకు పైగా వీసాల రద్దు!




నేరపూరిత కార్యకలాపాలకు పాల్పడ్డారన్న ఆరోపణలతో 2025లో అమెరికా లక్షకు పైగా వీసాలను రద్దు చేసింది. వాటిలో సుమారు 8,000మంది విద్యార్థుల వీసాలు ఉన్నాయి. "అమెరికాను సురక్షితంగా ఉంచే చర్యల్లో భాగంగా మేము ఈ నేరస్తులను బహిష్కరిస్తూనే ఉంటాము" అని విదేశాంగ శాఖ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొంది. "విదేశాంగశాఖ ఇప్పుడు లక్ష వీసాలను రద్దు చేసింది.

వాటిలో సుమారు 8,000 విద్యార్థి వీసాలు మరియు నేరపూరిత కార్యకలాపాలకు సంబంధించి అమెరికా చట్ట అమలు సంస్థల విచారణను ఎదుర్కొంటున్న వ్యక్తులకు చెందిన 2,500 ప్రత్యేక వీసాలు కూడా ఉన్నాయి" అని పేర్కొంది.ఏడాది కంటే తక్కువ సమయంలో ట్రంప్ యంత్రాంగం లక్ష వీసాలను రద్దు చేసిందని స్టేట్ డిపార్ట్‌మెంట్ ప్రిన్సిపల్ డిప్యూటీ స్పోక్‌పర్సన్ టామీ పిగోట్ పేర్కొన్నారు. దాడి, దొంగతనం మరియు మద్యం సేవించి వాహనం నడపడం వంటి నేరాలకు పాల్పడిన వారు లేదా దోషులుగా తేలిన వేలాది మంది విదేశీ పౌరుల వీసాలు కూడా ఇందులో ఉన్నాయని ఆయన తెలిపారు.

## మిలినీయం సిటీగా గుర్గావ్



న్యూఢిల్లీ,: భారత్ లో మిలీనియం సిటీగా గుర్గాం మారుతోంది. కార్పొరేట్ క్యాపిటల్‌గా మారింది. సైబర్ సిటీ, ఉద్యోగ్ విహార్‌లో 500+ ఫార్చ్యూన్ 500 కంపెనీలు, ఎం ఫర్ములు, స్టార్టప్‌లు ఫ్లిప్‌కార్ట్, పేటీఎం వంటివి ఉన్నాయి. 2025లో ఉద్యోగాలు 20% పెరిగాయి. ఎకానమిక్ బూస్ట్. హౌసింగ్ బూస్ట్ ను పెంచింది. అందుకే గుర్గాం భారతదేశంలో బిలియనీర్లకు ప్రధాన హాట్‌స్పాట్‌గా మారింది. ఇక్కడి లగ్జరీ రియల్ ఎస్టేట్ బూమ్, ఎం-స్టార్టప్ హబ్ స్థితి, ఢిల్లీకి సమీపత వల్ల హై-నెట్‌వర్త్ ఇండివిజువల్స్, బిలియనీర్లు ఇక్కడే స్థిరపడుతున్నారు.గోల్ఫ్ కోర్స్ రోడ్, ఆఒఈ కామెలియాస్, సెక్టార్ 44, ఆఒఈ సైబర్ సిటీ వంటి ప్రాంతాలు 'ఉత్తర భారతదేశం బిలియనీర్ల రో'గా పేరుపొందాయి ? ముంబై అల్టామౌంట్ రోడ్ లేదా న్యూయార్క్ బిలియనీర్ల రోతో పోల్చుతున్నారు. ఉమా మ్యాపింగ్, రియల్-టైమ్ వాటర్ మానిటరింగ్ వంటి టెక్ ఇనిషియేటివ్‌లు సస్టైనబుల్ డెవలప్‌మెంట్‌ను ప్రోత్సహిస్తున్నాయి. ద్వార్కా ఎక్స్‌ప్రెస్‌వే పూర్తి, రాపిడ్ మెట్రో విస్తరణలు, ఢిల్లీ-జైపూర్ హైవేలు ట్రాఫిక్‌ను 30% తగ్గించాయి. సెక్టార్ 90 వంటి ఏరియాలు, సస్టైనబుల్ డిజైన్‌తో గ్రీన్ స్పేసెస్, సైక్లింగ్ ట్రాక్‌లు మారుతున్నాయి.గురుగ్రామ్, వేగవంతమైన అర్బనైజేషన్‌తో భవిష్యత్ రియల్ ఎస్టేట్ హబ్‌గా మారుతోంది. దానికి తగ్గ మౌలిక సదుపాయాలను కల్పిస్తున్నారు. ఢిల్లీ నుంచి అతి దగ్గర కావడంతో.. ఎక్కడ మంది అక్కడ స్థరపడేందుకు ప్రాధాన్యమిస్తున్నారు. రాబోయే రోజుల్లో ముంబైతో పోటీ పడే అవకాశం ఉంది.

## కరాటేలో కంఫర్ట్ విద్యార్థుల ప్రతిభ




**కమాన్ పూర్,తెలంగాణ దిశ :**కమానపూర్ మండల కేంద్రానికి చెందిన కంఫర్ట్ గ్రామర్ పాఠశాల విద్యార్థులు పెద్దపల్లి జిల్లాలో నిర్వ హించిన రాష్ట్రస్థాయి కరాటే పాటిల్లో అద్వితీయ ప్రతిభకనబ ర్చారు. ఈ పోటీల్లో 16 మంది విద్యార్థులు పాల్గొనగ 16 మంది విద్యార్థులు మెడల్స్ సాధించారు. వీరిలో ఎం. సాద్విక (5వతరగతి) గోల్డ్మెడల్,ఎన్. శివమనిష్ (5వ),అదిబా తబస్సుమ్ (4వ) , బి.శివ మనీష్ (5వ), ఎస్. హర్షిత్ (6వ) సిల్వర్ మెడల్, ఎ.శివకుమా రస్వామి) , కె. అనుదీప్ (6వ), ఇంకామహీన్ (5వ) , కె. రోహిత్ (6వ) , యు ఆశ్రిత్రుద్ర (3వ ) , జి. రితిక శ్రీ (2వ) , బి అశ్విత్ (6వ) బ్రాంజ్ మెడల్, ఎ.శ్రీకాంత్ (5వ) , బి. నిత్యశ్రీ (5వ) , టి. అద్విత్ (5వ) , టి. శివన్షిత (3వ) పతకాలను సాధించిన వారికి ప్రముఖ కరాటే గ్రాండ్ మాస్టర్ కర్ర వెంకటేష్ మరియు టోర్ని చైర్మెన్ బండారి సంతోష్ గార్లు అందజేశారు, విద్యార్థులు పతకాలు సాధించడం పట్ల పాఠశాల ప్రధానోపాధ్యాయులు అర్నకొండ వినయ్ కుమార్, సౌమ్య గార్లు అభినందనలు. తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## ఇక తెలంగాణలో ఒడిశా ఫార్ములా!

**హైదరాబాద్,తెలంగాణ దిశ :**బీహార్ ఎన్నికల ఫలితాల తర్వాత బీజేపీ దక్షిణాదిలో ఉన్న తెలంగాణ రాష్ట్రంపై ఫోకస్ పెంచనుంది. దక్షిణాది రాష్ట్రాల్లో బలహీనంగా ఉండటంతో బీజేపీ తెలంగాణను తమ విజయానికి గేట్ వే గా మార్చుకోవాలని పార్టీ కేంద్ర నాయకత్వం నిర్ణయించినట్లు సమాచారం. అందుకోసమే ఇకపై కేంద్ర మంత్రులు తరచూ తెలంగాణలో పర్యటిస్తూ పార్టీని క్షేత్ర స్థాయిలో బలోపేతం చేయాలని ఆదేశాలు జారీ చేసింది. రానున్న కాలంలో తెలంగాణకు కేంద్ర ప్రభుత్వం నుంచి ప్రత్యేక నిధులు కూడా మంజూరయ్యే అవకాశాలున్నా యని బీజేపీ సీనియర్ నేత ఒకరు చెప్పడం విశేషం. అంటే ఇక దక్షిణాదిలో కర్ణాటక తర్వాత తెలంగాణను తమ అడ్డాగా చేసుకోవాలని పార్టీ నాయకత్వం భావిస్తుంది. మరో మూడేళ్ల సమయం ఎన్నికలకు ఉండటంతో ఇక నాయకుల పర్యటనలతో తెలంగాణను హోరెత్తించనున్నారు. మొన్నటి పార్లమెంటు ఎన్నికల్లో గతంలో ఎన్నడూ లేని విధంగా ఎనిమిది స్థానాలు రావడంతో ఇక్కడ అధికారంలోకి రావడానికి ఎక్కువ అవకాశాలున్నాయని పార్టీ నాయకత్వం భావిస్తుంది. ఎప్పటి నుంచో తెలంగాణపై బీజేపీ నాయకత్వం నజర్ పెట్టినా మొన్నటి ఎన్నికల్లో కొంత సానుకూల వాతావరణం కనిపించింది. అసెంబ్లీ ఎన్నికల్లోనూ అత్యధిక అసెంబ్లీ స్థానాలను గతంలో ఎన్నడూ లేని విధంగా కైవసం చేసుకుంది. అయితే ఇక్కడ ఒడిశా ఫార్ములాను బీజేపీ ప్రయోగించే అవకాశాలు లేకపోలేదు. ఒడిశాలోనూ తొలుత అక్కడ కాంగ్రెస్ ను బలహీనపర్చింది. తర్వాత నవీన్ పట్నాయక్ నేతృత్వంలోని బిజూ జనతాదళ్ ను ఓడించి ఒడిశా రాష్ట్రాన్ని కైవసం చేసుకుంది. అయితే ఇక్కడ ఆ ఫార్ములా రివర్స్ లో చేయాలని నిర్ణయించింది. ఇప్పటికే రెండుసార్లు అధికారాన్ని పొందిన ప్రాంతీయ పార్టీ బీఆర్ఎస్ ను తొలుత బలహీనం చేసిన తర్వాత ఇప్పుడు అధికారంలో ఉన్న జాతీయ పార్టీ కాంగ్రెస్ నుంచి అధికారాన్ని వేరు చేయాలన్న నిర్ణయానికి వచ్చింది. దేశంలో కర్ణాటక, తెలంగాణ వంటి పెద్ద రాష్ట్రాలే కాంగ్రెస్ చేతిలో ఉన్నాయి. వాటిని కూడా తమ చేతికి అందుకోవాలన్న ప్రయత్నంలో భాగంగా కర్ణాటకలో ఈసారి తమదే అధికారం అని నమ్ముతున్న బీజేపీ కేంద్ర నాయకత్వం, తెలంగాణలో మాత్రం పార్టీ నాయకత్వంతో పాటు క్షేత్రస్థాయిలో బలోపేతం చేయడానికి అవసరమైన అన్ని రకాల వ్యూహాలను సిద్ధం చేస్తుంది. ఒంటరిగానే తెలంగాణలో ఒంటిచేత్తో అధికారంలోకి రావడానికి ప్రయత్నాలు ఇప్పటికే ప్రారంభించిందని పార్టీ వర్గాలు వెల్లడిస్తున్నాయి.

## సీబీఐ దర్యాప్తునకు హాజరైన విజయ్!



చెన్నై : కరూర్ జిల్లాలో జరిగిన తొక్కిసలాట ఘటనలో సీబీఐ దర్యాప్తునకు టీవీకే అధ్యక్షుడు, నటుడు విజయ్ హాజరయ్యారు.

గతేడాది సెప్టెంబరు 27న వేలుసామిపురంలో నిర్వహించిన విజయ్ ప్రచారసభలో జరిగిన తొక్కిసలాటలో 41 మంది మరణించిన ఘటనపై సీబీఐ దర్యాప్తు చేపట్టిన విషయం తెలిసిందే.

ఇప్పటికే టీవీకే నేతలను విచారించిన నేపథ్యంలో ఆ పార్టీ అధ్యక్షుడు విజయ్ సోమవారం హాజరుకావాలంటూ సీబీఐ నోటీసులు పంపింది. ఆ మేరకు సోమవారం ఉదయం చెన్నై నుంచి విమానంలో దిల్లీ బయలుదేరి వెళ్లారు. నేరుగా సీబీఐ కార్యాలయంలో హాజరయ్యారు. ఘటన జరిగిన రోజు ప్రచారానికి ఆలస్యంగా వెళ్లడానికి కారణమేంటి? రద్దీని క్రమబద్ధీకరించడానికి పోలీసులు లాఠీఛార్జీ జరపడం గురించి తెలుసా? అకస్మాత్తుగా తొక్కిసలాట ఎందుకు చోటుచేసుకుంది? తదితర ప్రశ్నలు సంధించినట్లు సమాచారం.

## అస్థిరతను అధిగమించేలా బంధాల బలోపేతంగాంధీ బోధనలు ఇప్పుడింకా అవసరం!

మోదీతో భేటీలో జర్మనీ ఛాన్స్‌లర్ ఫ్రెడ్రిక్ మెర్జ్

అహ్మదాబాద్‌లో గాలిపటాన్ని ఎగరేస్తున్న ఫ్రెడ్రిక్, మోదీ



అహ్మదాబాద్: ప్రపంచవ్యాప్త అస్థిర పరిస్థితుల్లో సవాళ్లను ఉమ్మడిగా ఎదుర్కొనేందుకు పరస్పరం సహకరించుకోవాలని భారత్, జర్మనీ ప్రతిపాదించుకున్నాయి. ఆ మేరకు బంధాలు బలోపేతం చేసుకోవాలని జర్మనీ ఛాన్స్‌లర్ ఫ్రెడ్రిక్ మెర్జ్, ప్రధాని నరేంద్రమోదీ నిర్ణయించుకున్నారు. మహాత్మాగాంధీ బోధనలు ఇప్పుడింకా అవసరమని ఫ్రెడ్రిక్ పేర్కొన్నారు. భారత్‌లో రెండ్రోజుల పర్యటన కోసం సోమవారం వచ్చిన ఆయన అహ్మదాబాద్‌లో మోదీతో ద్వైపాక్షిక చర్చలు జరిపారు. ఇరువురు కలిసి సబర్మతి ఆశ్రమాన్ని సందర్శించారు. పతంగుల పండుగలో పాల్గొన్నారు. రక్షణ, భద్రత, వాణిజ్యం, విలువైన ఖనిజాలు, సెమీ కండక్టర్లు, శాస్త్ర-సాంకేతిక రంగాలు, విద్య, నైపుణ్యం, పరిశోధన రంగాల్లో సహకారాన్ని పెంపొందించుకోవాలని రెండు దేశాలూ నిర్ణయించుకున్నాయి. ఈ మేరకు ఇరువురు నేతల సమక్షంలో 19 ఒప్పందాలపై సంతకాలు జరిగాయి. రక్షణరంగ పరిశ్రమలు, ఉన్నత విద్యారంగంలోనూ సహకారానికి మార్గసూచీ రూపొందించుకోనున్నా యి. టెలికాం రంగంపై విడిగా ఒక ఒప్పందం కుదిరింది. మొత్తం వాణిజ్యరంగ విస్తరణకు భారత్-ఈయూ స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాన్ని త్వరగా కొలిక్కి తీసుకురావాలని నేతలిద్దరూ ప్రతిపాదించారు. భారత్‌లో ఉన్న వ్యాపార పరిమాణం, జర్మనీ నవకల్పనలు చేతులు కలిపితే రెండు దేశాలకే కాకుండా ప్రపంచానికంతటికీ సుస్థిర పరిష్కారాలు చూపించవచ్చని మోదీ చెప్పారు. భారత్-జర్మనీ సీఈవోల వేదిక సమావేశంలోనూ ఆయన ప్రసంగించారు.

జర్మనీ మీదుగా వెళ్లే భారతీయులకు వీసా-రహిత ట్రాన్సిట్ అవకాశాన్ని కల్పిస్తామని ఫ్రెడ్రిక్ ప్రకటించారు.గుజరాత్‌లోని అహ్మదాబాద్‌లో జరుగుతున్న అంతర్జాతీయ గాలిపటాల పండగలో సోమవారం ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, జర్మనీ ఛాన్సలర్ ఫ్రెడ్రిక్ మెర్జ్ఎఫ్‌టీఏ పూర్తయితే కొత్త శిఖరాలకు సంబంధాలు స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం (ఎఫ్‌టీఏ) పూర్తయితే భారత్-జర్మనీ, భారత్-ఈయూ సంబంధాలు కొత్త శిఖరాలకు చేరుకుంటాయని ఫ్రెడ్రిక్ పేర్కొన్నారు. ద్వైపాక్షిక సంబంధాలపై చర్చల అనంతరం మోదీ, ఆయన సంయుక్తంగా విలేకరుల సమావేశంలో మాట్లాడారు. 'మా ప్రభుత్వ హయాంలో వ్యాపారానికి, వ్యాపార సహకారానికి తలుపులు ఎప్పుడూ తెరిచే ఉంటాయి. భారత్‌లో వ్యాపార అవకాశాల కోసం ఆసక్తిగా ఎదురుచూస్తున్నాం. పరిశ్రమలు, సాంకేతిక రంగాల్లో పరస్పర సహకారానికి మన రెండు దేశాలకు అనేక అవకాశాలున్నాయి' అని ఫ్రెడ్రిక్ చెప్పారు. భారత్ నుంచి నైపుణ్య కార్మికులు, నర్సుల అవసరం తమ దేశానికి ఎక్కువగా ఉంటోందన్నారు. నేతలిద్దరూ సబర్మతి నదీ తీరానికి చేరుకున్నారు. భారత్-జర్మనీ సీఈవోల ఫోరం సమావేశంలో మోదీ ప్రసంగించారు.పదపదవే వయ్యారి గాలిపటమా..! అంతర్జాతీయ పతంగుల పండుగ-2026ని మోదీ ప్రారంభించగా ఇద్దరు అగ్రనేతలు కలిసి గాలిపటాలను వీక్షించారు. వాటిని ఎలా తయారుచేస్తారో మహిళా కళాకారుల్ని అడిగి తెలుసుకున్నారు. పైకప్పులేని వాహనంలో మైదానంలో విహరించారు. స్వయంగా గాలిపటాలు ఎగరవేసి ఆనందించారు. గాలిపటాలు ఎగురవేయడంలో ప్రావీణ్యం ఉన్న 135 మంది ప్రతినిధులు 50 దేశాల నుంచి వచ్చి దీనిలో పాల్గొన్నారు. మరో వెయ్యి మందివరకు ఔత్సాహికులు పాలుపంచుకుంటున్నారు. ఈ నెల 14 వరకు ఇది కొనసాగనుంది. ఐదు లక్షలమంది పర్యాటకులు వీటిని వీక్షించడానికి వస్తారని అంచనా.

## ఇజ్రాయెల్ ప్రధానిపై ఢిల్లీ పేలుడు ఘటన ఎఫెక్ట్‌మూడోసారి ఆ కీలక పర్యటన రద్దు



ఇజ్రాయెల్ ప్రధాన మంత్రి బెంజమిన్ నెతన్యాహు భారత్ పర్యటన మరోసారి వాయిదా పడింది. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీతో సమావేశం కోసం ఈ ఏడాది చివర్లో షెడ్యూల్ చేసిన ఈ పర్యటన.. రెండు వారాల క్రితం న్యూఢిల్లీలో జరిగిన భయంకరమైన ఆత్మాహుతి దాడి నేపథ్యంలో భద్రతాపరమైన ఆందోళనల కారణంగా రద్దు అయింది. అయితే ఈ పర్యటన రద్దు కావడం ఇదే తొలిసారి కాదు. గతంలోనే రెండు సార్లు పలు కారణాల వల్ల నెతన్యాహు భారత పర్యటన రద్దయింది. భారత దేశానికి రావాలన్న నెతన్యాహు ప్రణాళిక ఈ ఏడాది రద్దు కావడం ఇది మూడోసారి. దీనికి సంబంధించి ఇజ్రాయెల్ మీడియా సంస్థ ఓ నివేదిక విడుదల చేసింది. భద్రతా పరిస్థితులపై తాజా అంచనాల తర్వాత నెతన్యాహు వచ్చే ఏడాది కొత్త తేదీని ఖరారు చేసుకునే అవకాశం ఉందని ఆ నివేదిక పేర్కొంది. నెతన్యాహు 2018 జనవరిలో భారత్‌లో పర్యటించారు. గత కొంతకాలంగా ఇరు దేశాల ప్రధానులైన మోదీ, నెతన్యాహు మధ్య బలమైన వ్యక్తిగత సాన్నిహిత్యం ఏర్పడింది. 2017లో మోదీ ఇజ్రాయెల్‌లో పర్యటించిన తొలి భారత ప్రధానిగా నిలిచారు. ఈ సన్నిహిత సంబంధాల గురించి భారత, ఇజ్రాయెల్ పత్రికల్లో తరచుగా చర్చ జరుగుతుంటుంది. ఈ పర్యటన నెతన్యాహు రాజకీయ వ్యూహంలో కూడా కీలకమైంది. ఇజ్రాయెల్‌లో అసాధారణంగా పదేపదే ఎన్నికలు జరుగుతున్న నేపథ్యంలో.. నెతన్యాహు ప్రపంచ వ్యాప్తంగా తనకున్న మద్దతును ప్రదర్శించడానికి ఈ పర్యటనను ఉపయోగించుకోవాలని భావించారు. గతంలో ఏప్రిల్‌లో, ఆపై సెప్టెంబర్ 9వ తేదీన ఇజ్రాయెల్‌లో జరిగిన అసాధారణ పునః-ఎన్నికల కారణంగా ఆయన తన పర్యటనలను రద్దు చేసుకున్నారు.

## స్కూల్‌కు వచ్చి పిల్లల కిడ్నాప్...!

కర్ణాటకలోని ధారవాడలో స్కూల్ పిల్లల కిడ్నాప్‌నకు యత్నించిన ఘటన తీవ్ర కలకలం సృష్టించింది. ప్రభుత్వ పాఠశాలకు వచ్చిన దుండగుడు పిల్లల్ని అపహరించుకుపోవడం (ఐతిటనిజీజూ) చర్చనీయాంశమైంది. అయితే, అనుకోనివిధంగా జరిగిన రోడ్డు ప్రమాదంలో ఆ పిల్లలు కిడ్నాపర్ బారినుంచి బయటపడ్డారు. అసలేం జరిగిందంటే..ధారవాడలోని కమలాపూర్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో మూడోతరగతి చదువుతున్న ఎనిమిదేళ్ల వయసున్న ఇద్దరు పిల్లలు మధ్యాహ్నభోజనం తర్వాత తిరిగి క్లాస్‌రూమ్‌లోకి రాలేదు. స్కూల్ యాజమాన్యం, సిబ్బంది ఎంత వెతికినా కనిపించకపోవడంతో వారి తల్లిదండ్రులను ఆరా తీశారు. పిల్లలు వారి ఇళ్లకు కూడా వెళ్లలేదని తెలియడంతో స్థానికంగా ఉన్న సీసీటీవీ ఫుటేజ్‌లను చూశారు. దీంతో వారు కిడ్నాప్‌నకు గురైనట్లు తెలిసింది.లంచ్ బ్రేక్ సమయంలో ఓ వ్యక్తి స్కూల్ ప్రాంగణంలోకి వచ్చి పిల్లలతో మాట్లాడినట్లుగా సీసీటీవీలో రికార్డ్ అయ్యింది. ఆ తర్వాత పిల్లలిద్దరినీ బైక్‌పై ఎక్కించుకొని ఆ వ్యక్తి అక్కడి నుంచి వేగంగా వెళ్లిపోయాడు. దీంతో స్కూల్ యాజమాన్యం వెంటనే పోలీసులకు సమాచారమిచ్చింది. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు పిల్లల కోసం ముమ్మర గాలింపు చేపట్టారు.అదే సమయంలో పిల్లలను తీసుకెళ్తుండగా ఉత్తర కన్నడ జిల్లాలోని దండేలీ ప్రాంతంలో దుండగుడు నడుపుతున్న బైక్‌కు ప్రమాదం జరిగింది. పోలీసులు అక్కడికి చేరుకుని ఆరాతీయగా అతడు పొంతన లేని సమాధానాలు చెప్పాడు. దీంతో పిల్లలను కిడ్నాప్ చేసినట్లు గుర్తించిన పోలీసులు.. ధారవాడ పోలీసులకు సమాచారమిచ్చారు. వారు అక్కడికి చేరుకుని పిల్లలను వారి తల్లిదండ్రులకు అప్పగించారు. నిందితుడిని కరీమ్ మేస్త్రీగా గుర్తించారు. అతడిని అరెస్ట్ చేసి ఘటనపై పోలీసులు దర్యాప్తు చేపట్టారు. ఈ కిడ్నాప్ వెనక పిల్లల అక్రమ రవాణా ముఠా ఉండొచ్చని అనుమానం వ్యక్తం చేస్తున్నారు. పిల్లల్లో ఒకరికి నిందితుడు తెలుసని, జాతర చూపిస్తానని ఆశ పెట్టి అతనివెంట తీసుకెళ్లినట్లు పోలీసులు తెలిపారు.

## బంగ్లాదేశ్‌లో ఆగని మైనార్టీల హత్యలు!



**హైదరాబాద్ :** బంగ్లాదేశ్‌లో మైనార్టీలైన హిందువుల హత్యలు ఆగడం లేదు. సోమిర్ కుమార్ అనే ఆటో డ్రైవర్ పై దాడి మూక దాడి జరిగింది. దాస్‌ను కొట్టి, ఆపై కత్తితో పొడిచి చంపారు.ఆ తర్వాత మృతుని ఈ-ఆటో రిక్షాతో దుండగులు పారిపోయారు. ఇది ముందస్తు పథకం ప్రకారం జరిగిన హత్య అని పోలీసులు చెబుతున్నారు. పోలీసులు నిందితుల్ని గుర్తించేందుకు ఆపరేషన్ ప్రారంభించారు. మండలి, దేశవ్యాప్తంగా మైనారిటీ వర్గాలపై పెరుగుతున్న దాడులపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. ఫిబ్రవరిలో బంగ్లాదేశ్ సార్వత్రిక ఎన్నికలు జరగబోతున్న తరుణంలో మైనారిటీలపై హింసాత్మక దాడులు ఎక్కువయ్యాయి.బంగ్లా తాత్కాలిక దేశాధినేత మహ్మద్ యూనస్ ఈ మారుణకాండను అడ్డుకోవడం లేదు. బంగ్లాదేశ్‌లోని తీవ్రవాదులు మైనారిటీలపై, వారి ఇళ్ళు, సంస్థలు, వ్యాపార సంస్థలపై ఆందోళనకరమైన దాడులను మేము చూస్తూనే ఉన్నాము. ఇటువంటి మత సంఘటనలను త్వరగా మరియు దృఢంగా పరిష్కరించాల్సిన అవసరం ఉంది" అని విదేశాంగ మంత్రిత్వ శాఖ (ఓఇం) ప్రతినిధి రణధీర్ జైస్వాల్ అన్నారు.

ఫిబ్రవరిలో బంగ్లాదేశ్ సార్వత్రిక ఎన్నికలు జరగబోతున్న తరుణంలో మైనారిటీలపై హింసాత్మక దాడులు ఎక్కువయ్యాయి.బంగ్లా తాత్కాలిక దేశాధినేత మహ్మద్ యూనస్ ఈ మారుణకాండను అడ్డుకోవడం లేదు.

# అరుదైన ఘనతను సాధించిన అదానీ సోలార్!




దేశీయ అదానీ సోలార్ సంస్థ అరుదైన ఘనతను సొంతం చేసుకుంది. ప్రపంచ క్లీన్ ఎనర్జీ ఉత్పత్తిలో భారత్ స్థానాన్ని మెరుగుపరుస్తూ, ప్రముఖ వుడ్ మెకెంజీ ర్యాకింగ్స్?లో అదానీ సోలార్‌కు చోటు దక్కింది. వుడ్ మెకెంజీ గ్లోబల్ సోలార్ మాడ్యూల్ తయారీ ర్యాంకింగ్‌లో స్థానం సంపాదించిన ఏకైక భారతీయ కంపెనీ అదానీ సోలార్ నిలిచింది. అదానీ న్యూ ఇండస్ట్రీస్‌కు చెందిన అదానీ సోలార్‌కు అంతర్జాతీయంగా 8వ ర్యాంకు లభించడమే కాకుండా, గ్రేడ్ ఏ రేటింగ్ లభించింది. నాణ్యత, ఆర్థిక బలం, పనితీరు, విశ్వసనీయత వంటి అంశాల ఆధారంగా కంపెనీకి ఈ గౌరవడం దక్కింది. ఈ జాబితాలో చైనా కంపెనీలు ఇప్పటికీ అగ్రస్థానాల్లో ఆధిపత్యం చెలాయిస్తున్నప్పటికీ, అదానీ సోలార్ ఉనికి భారత్‌ను ప్రపంచవ్యాప్తంగా మరింత పోటీకి నిలబెట్టింది.గతేడాది మొదటి ఆరునెలలకు సంబంధించి వుడ్ మెకెంజీ తన తాజా నివేదికను విడుదల చేసింది. ఇది సోలార్ ప్యానెల్ కంపెనీలకు సంబంధించిన షిప్‌మెంట్‌లు, బ్యాంకింగ్, పనితీరును తనిఖీ చేస్తుంది. దాదాపు 38 కంపెనీలను సమీక్షించి వుడ్ మెకెంజీ తన నివేదికను రూపొందించింది. ఇందులో జేఏ సోలార్ 91.7 పాయింట్లు, ట్రినాసోలార్ 91.6 పాయింట్లతో సంయుక్తంగా టాప్ ర్యాంకులో నిలిచాయి. అదానీ సోలార్ 81 పాయింట్లను సాధించింది. అలాగే, గ్రేడ్ ఏ రేటింగ్ ద్వారా కంపెనీ అత్యున్నత పనితీరు, పారదర్శకత ప్రమాణాలను సూచిస్తుంది. కాగా, 2025 నాటికి అదానీ సోలార్ దేశీయ, అంతర్జాతీయ మార్కెట్లలో 15,000 మెగావాట్ల కంటే ఎక్కువ సౌర మాడ్యూళ్లను రవాణా చేసింది. ఇందులో 10,000 మెగావాట్లు దేశీయంగా, మిగిలిన 5,000 మెగావాట్లు విదేశాలకు ఎగుమతి చేసింది. ఇదే సమయంలో కంపెనీ 8,000 కంటే ఎక్కువ ప్రత్యక్ష ఉద్యోగాలు, భారీగా పరోక్ష ఉద్యోగాలను సృష్టించింది.

అదానీ సోలార్‌కు అంతర్జాతీయంగా 8వ ర్యాంకు లభించడమే కాకుండా, గ్రేడ్ ఏ రేటింగ్ లభించింది. నాణ్యత, ఆర్థిక బలం, పనితీరు, విశ్వసనీయత వంటి అంశాల ఆధారంగా కంపెనీకి ఈ గౌరవడం దక్కింది. ఈ జాబితాలో చైనా కంపెనీలు ఇప్పటికీ అగ్రస్థానాల్లో ఆధిపత్యం చెలాయిస్తున్నప్పటికీ, అదానీ సోలార్ ఉనికి భారత్‌ను ప్రపంచవ్యాప్తంగా మరింత పోటీకి నిలబెట్టింది.గతేడాది మొదటి ఆరునెలలకు సంబంధించి వుడ్ మెకెంజీ తన తాజా నివేదికను విడుదల చేసింది.

# టెక్ రంగంలో ఈ ఏడాది 1.25 లక్షల ఉద్యోగాలు!



ఈ ఏడాది దేశీయ టెక్ రంగంలో భారీ నియామకాలు జరగనున్నాయి. 2026లో దాదాపు 1,25,000 కొత్త ఉద్యోగాలకు అవకాశాలు లభిస్తాయని, ముఖ్యంగా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్(ఏఐ), డేటా, సైబర్ సెక్యూరిటీ ఉద్యోగాలను అత్యధిక గిరాకీ ఉంటుందని హెచ్‌ఆర్ సొల్యూషన్స్ సంస్థ అడెక్కో ఇండియా నివేదిక తాజా ప్రకటనలో వెల్లడించింది.

ఈ ఉద్యోగాలు ప్రయోగాత్మక దశ నుంచి ప్రధాన అవసరాల దశకు చేరాయని నివేదిక అభిప్రాయపడింది. ఫలితంగా ఈ ఉద్యోగాలకు గిరాకీ కూడా 51 శాతం పెరిగింది. దీనివల్ల ఈ ఏడాది ఉద్యోగాలు 12-15 శాతం పెరుగుతాయని అంచనా. దాదాపు 40 శాతం దిగ్గజ సంస్థలు ఇప్పటికే రోజువారీ పనిలో జనరేటివ్ ఏఐని ఉపయోగిస్తున్నాయి.

2023, 2024లలో నెమ్మదించిన తర్వాత 2025లో ఐటీ, ఐటీ సేవల రంగంలో నియామకాలు రికవరీ అవుతున్నాయని అడెక్కో ఇండియా డైరెక్టర్ సంకేత్ చెంగప్ప అన్నారు. కంపెనీలు ఇప్పుడు మళ్ళీ నియామక ప్రక్రియను మొదలుపెట్టాయి. ముఖ్యంగా ఏఐ, క్లౌడ్ కంప్యూటింగ్, సైబర్ సెక్యూరిటీ, డేటా, ఆధునిక ప్లాట్‌ఫామ్‌లకు సంబంధించిన నైపుణ్యాల కోసం ఉద్యోగులను తీసుకుంటున్నాయి. కొత్త గ్రాడ్యుయేట్ల నియామకం కూడా పెరిగింది.

దీనర్థం ఐటీ రంగం నెమ్మదిగా కోలుకుంటోందని, 2026లో మరింత బలంగా పుంజుకోగలదని నివేదిక తెలిపింది. భారతీయ ఐటీ కంపెనీల్లో అగ్రశ్రేణి కంపెనీలు ఫ్రెషర్లు, స్కిల్స్ ఉన్న నిపుణులను తీసుకోవడం కొనసాగిస్తామని చెప్పాయి. ఇటీవల డిసెంబర్ త్రైమాసికంలో ఐటీ సేవల దిగ్గజం ఇన్ఫోసిస్ 5,043 మంది ఉద్యోగులను, విప్రో 6,529 మంది ఉద్యోగులను చేర్చుకుంది. కంపెనీలు ఉద్యోగులకు ఏఐ, భవిష్యత్తు సాంకేతికతలలో శిక్షణ కోసం భారీగా ఖర్చు చేస్తున్నాయి.

2,17,000 మంది ఉద్యోగులు ఇప్పుడు అధునాతన ఏఐ స్కిల్స్ కలిగి ఉన్నారని, ఇది గతేడాది కంటే మూడు రెట్లు ఎక్కువ అని టీసీఎస్ వెల్లడించింది. ఏఐ కొత్త ఉద్యోగాలను సృష్టిస్తోందని, ఏఐపై ఎక్కువ దృష్టి పెట్టడానికి కంపెనీ తన జాబ్ స్ట్రక్చర్‌నే మారుస్తున్నట్టు పేర్కొంది.

# సరికొత్త రికార్డుల దిశగా దూసుకెళుతున్న వెండి!



వెండి ధరలు దూసుకెళుతున్నాయి. పెట్టుబడిదారుల ఆసక్తిని ఆకర్షిస్తూ ఈ తెల్లని లోహం సరికొత్త రికార్డులను తాకుతోంది. ఈ జనవరి నెలలోనే ఇప్పటివరకు 22 శాతం మేర వెండి ధర పెరిగింది. ప్రధాన పెట్టుబడి సాధనాల్లో అత్యుత్తమ ప్రదర్శన కనబరుస్తోంది. ప్రస్తుతం కిలో వెండి ధర రూ. 3 లక్షల మైలురాయికి అత్యంత చేరువలో ఉంది.గత శుక్రవారం ఎంసీఎక్స్‌లో కిలో వెండి ధర రూ. 2,87,762 వద్ద ముగిసింది. గత ఏడాది ఏప్రిల్ లో రూ. 95,917గా ఉన్న ధర, అప్పటి నుంచి దాదాపు 200 శాతం పెరగడం గమనార్హం. సాధారణంగా మల్టీబ్యాగర్ స్టాక్స్ లో కనిపించే ఈ తరహా రాబడి, కమోడిటీలో నమోదు కావడం విశేషం. గత వారమే కిలో వెండి రూ. 2,92,960 వద్ద సరికొత్త రికార్డును సృష్టించింది.వెండి ధరకు ఇంతటి డిమాండ్ రావడానికి పలు అంతర్జాతీయ అంశాలు దోహదం చేస్తున్నాయి. గత మూడేళ్లుగా పెద్ద ఎత్తున బంగారాన్ని కొనుగోలు చేసిన ప్రపంచ కేంద్ర బ్యాంకులు, ఇప్పుడు తమ నిల్వల్లోకి వెండిని కూడా చేర్చుకుంటున్నట్లు వస్తున్న నివేదికలు ధరలకు మరింత ఊతమిస్తున్నాయి. దీనికి తోడు, మార్కెట్లో భౌతిక వెండి నిల్వలు తగ్గడం కూడా ధరల పెరుగుదలకు మరో కారణంగా నిలుస్తోంది. నిజానికి, 2025 ప్రారంభంలో వెండిపై పెట్టుబడిదారులు పెద్దగా ఆసక్తి చూపలేదు.

గత ఏడాది చివరి నాటికి వెండి ధర రూ. 1,10,000 చేరుకుంటుందని విశ్లేషకులు అంచనా వేయగా, ఆ మార్కును చాలా ముందే దాటేసింది. ఆ తర్వాత కూడా ఆగకుండా రూ.2,54,000 స్థాయిని తాకి, అంచనాలను తలకిందులు చేసింది. ప్రస్తుత ముగింపు ధర ప్రకారం చూస్తే? రూ.3 లక్షల మైలురాయిని దాటడానికి వెండికి కేవలం 4.2 శాతం పెరుగుదల మాత్రమే అవసరం. ఈ నేపథ్యంలో పెట్టుబడిదారుల దఅష్టి ఇప్పుడు పూర్తిగా వెండిపైనే కేంద్రీకృతమై ఉంది.

# 5 త్రైమాసికాల గరిష్ఠానికి సీఐఐ వ్యాపార విశ్వాస సూచీ

Confederation of Indian Industry

వరుసగా మూడో త్రైమాసికంలో (అక్టోబరు-డిసెంబరు)నూ సీఐఐ వ్యాపార విశ్వాస సూచీ (బీసీఐ) పెరిగిందని భారత పరిశ్రమల సమాఖ్య (సీఐఐ) తెలిపింది. గిరాకీ, లాభదాయకత, పెట్టుబడి పరిస్థితుల్లో ఉన్న ఆశావాదం కారణంగా బీసీఐ 66.5కు చేరిందని, ఇది 5 త్రైమాసికాల గరిష్ఠ స్థాయి అని పేర్కొంది. దేశీయంగా లభిస్తున్న గిరాకీ కీలకమైన చోదక శక్తిగా ఉందని.. మూడింట రెండొంతుల సంస్థలు 2025-26 జులై-సెప్టెంబరులో అధిక డిమాండ్‌ను నివేదించాయని సీఐఐ వెల్లడించింది. మూడో త్రైమాసికంలో మరింత వృద్ధి లభించిందని 72% సంస్థలు పేర్కొన్నాయి.

జీఎస్‌టీ రేట్లు తగ్గించడం, పండగ వినియోగం పెరగడం.. గిరాకీ వృద్ధికి దోహదపడతాయని తెలిపింది. దేశంలోని వేర్వేరు ప్రాంతాల్లో ఉన్న సూక్ష్మ, చిన్న, మధ్య, పెద్ద సంస్థలతో పాటు అన్ని పరిశ్రమల రంగాల అభిప్రాయాలను సేకరించి, ఈ అభిప్రాయానికి సీఐఐ వచ్చింది. తయారీ, సేవల్లో నిమగ్నమైన ప్రభుత్వ, ప్రైవేటు రంగాల్లోని 175 సంస్థల నిర్వాహకుల వద్ద 2025 డిసెంబరు తొలి - మూడో వారం మధ్య అభిప్రాయాలు సేకరించారు. కొత్త పెట్టుబడులు, కొత్త ఉద్యోగ నియామకాలపైనా ఆశావాదం బలంగా ఉన్నట్లు తేలింది. ఇది 5 త్రైమాసికాల గరిష్ఠ స్థాయి అని పేర్కొంది.

దేశీయంగా లభిస్తున్న గిరాకీ కీలకమైన చోదక శక్తిగా ఉందని.. మూడింట రెండొంతుల సంస్థలు 2025-26 జులై-సెప్టెంబరులో అధిక డిమాండ్‌ను నివేదించాయని సీఐఐ వెల్లడించింది. మూడో త్రైమాసికంలో మరింత వృద్ధి లభించిందని 72% సంస్థలు పేర్కొన్నాయి. జీఎస్‌టీ రేట్లు తగ్గించడం, పండగ వినియోగం పెరగడం.. గిరాకీ వృద్ధికి దోహదపడతాయని తెలిపింది. దేశంలోని వేర్వేరు ప్రాంతాల్లో ఉన్న సూక్ష్మ, చిన్న, మధ్య, పెద్ద సంస్థలతో పాటు అన్ని పరిశ్రమల రంగాల అభిప్రాయాలను సేకరించి, ఈ అభిప్రాయానికి సీఐఐ వచ్చింది. ప్రస్తుత త్రైమాసికంలో రెపోరేటును రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) మరింత తగ్గిస్తుందని 69% సంస్థలు ఆశిస్తున్నాయి.

దేశ వృద్ధిరేటును ఉపకరించేలా రాబోయే బడ్జెట్‌లో సంస్కరణల వేగం కొనసాగుతుందని సీఐఐ విశ్వాసం వ్యక్తం చేసింది. సెప్టెంబరు 22 నుంచి అమల్లోకి వచ్చిన జీఎస్‌టీ కోతల వల్ల విక్రయాలకు ఊతం లభించింది. రాబోయే త్రైమాసికాల్లో తమ విక్రయాలు 5 - 20% పెరుగుతాయని 56.3% సంస్థలు ఆశాభావంతో ఉన్నాయి. సాహసోపేత సంస్కరణల చొరవతో, మన దేశం ప్రపంచంలోనే అత్యంత వేగంగా వృద్ధి చెందుతున్న ప్రధాన ఆర్థిక వ్యవస్థగా స్థిరపడిందని సర్వే తేల్చింది.

# 20 ఏళ్ల తర్వాత పట్టణ సహకార బ్యాంకులకు లైసెన్స్ ఇవ్వనున్న ఆర్‌బీఐ....




20 ఏళ్లకు పైగా విరామం తర్వాత, పట్టణ సహకార బ్యాంకుల (యూసీబీలు)కు లైసెన్సుల జారీని తిరిగి ప్రారంభించాలని భారతీయ రిజర్వ్ బ్యాంక్ (ఆర్‌బీఐ) ప్రతిపాదించింది.కొత్త యూసీబీలు ఆర్థికంగా విఫలమవడంతో 2004లో లైసెన్సుల జారీని నిలిపివేశారు. ప్రస్తుతం వీటిని కనీసం రూ. 300 కోట్ల మూలధనంతో సహా కఠినమైన నిబంధనలతో కొత్త లైసెన్సులను మళ్లీ అనుమతించాలని భావిస్తోంది. దీనికి సంబంధించి తాజాగా ఆర్‌బీఐ చర్చాపత్రాన్ని విడుదల చేసింది. ఈ ఏడాది ఫిబ్రవరి 13లోగా అభిప్రాయాలను తెలియజేయాలని ప్రజలను, వాటాదారులను కోరింది. గత కొన్ని సంవత్సరాలుగా ఆర్‌బీఐ బలహీనంగా ఉన్న యూసీబీలను విలీనం చేయడం లేదా పనితీరు సరిగా లేని బ్యాంకులను మూసివేయడం ద్వారా వాటి సంఖ్యను తగ్గించింది. అయినప్పటికీ, అనేక యూసీబీలు ఇప్పటికీ బలహీన పనితీరుతో కొనసాగుతున్నాయి.

కొన్ని ఆర్‌బీఐ ఆంక్షల పరిధిలో ఉన్నాయి. గతంలో జరిగిన చిన్న యూసీబీలే ఎక్కువగా నష్టాలను చూశాయి. దీన్ని దృష్టిలో ఉంచుకుని పెద్ద, మెరుగైన నిర్వహణ కలిగిన సహకార బ్యాంకులకు మాత్రమే లైసెన్సులను అనుమతించే అవకాశాలు ఉన్నాయి. ఇలాంటి యూసీబీలు సాధారణంగా మెరుగైన నిర్వహణ, సుదీర్ఘ అనుభవం, తక్కువ రిస్క్ కలిగి ఉంటాయి. ఈ నేపథ్యంలో కొత్త లైసెన్సుల కోసం ఆర్‌బీఐ కఠినమైన షరతులను సూచించింది. ఒక యూసీబీ కనీసం 10 ఏళ్లుగా పనిచేస్తూ ఉండాలి. గత 5 ఏళ్ల మంచి ఆర్థిక రికార్డును కలిగి ఉండాలి. రూ. 300 కోట్ల మూలధనం, కనీసం 12 శాతం మూలధన సమృద్ధి నిష్పత్తి, 3 శాతం కంటే తక్కువ మొండి బకాయిలు ఉండాలి. కాగా, 2025, మార్చి నాటికి, దేశంలో 1,457 యూసీబీలు ఉన్నాయి. వాటి మొత్తం ఆస్తుల విలువ రూ. 7.38 లక్షల కోట్లు, రూ. 5.84 లక్షల కోట్ల విలువైన డిపాజిట్లు ఉన్నాయి.

# పదేళ్లలో 10 కోట్ల ఉద్యోగాలు సృష్టిద్దాం



రాబోయే పదేళ్లలో మనదేశంలో 10 కోట్ల ఉద్యోగాలను సృష్టించే లక్ష్యంతో 'హండ్రెడ్ మిలియన్ జాబ్స్' పేరిట ఓ కార్యక్రమాన్ని పరిశ్రమ ప్రముఖులు కొందరు ప్రారంభించారు. దేశ ఆర్థిక వ్యవస్థ వేగవంత వృద్ధిని సాధిస్తున్నప్పటికీ.. ఉద్యోగ కల్పన ఆశించిన స్థాయిలో లేని నేపథ్యంలో, దీనికి శ్రీకారం చుట్టారు. ఐటీ పరిశ్రమ సంఘమైన నాస్కామ్ సహ-వ్యవస్థాపకుల్లో ఒకరైన హరీశ్ మెహతా, ద ఇండస్ ఎంటర్‌ప్రెన్యూర్స్ (టీఐఈ) వ్యవస్థాపకుడు ఏజే పటేల్, సెంటర్ ఫర్ ఇన్నోవేషన్ ఇన్ పబ్లిక్ పాలసీ (సీఐపీపీ) వ్యవస్థాపకుడు కె యతీశ్ రజావత్ ఈ కార్యక్రమాన్ని ప్రకటించారు. 'దేశంలో ఏటా పని వయస్సుకు చేరుతున్న వారి సంఖ్య సుమారు 1.2 కోట్లుగా ఉంటోంది. సాధారణంగా ఉద్యోగ కల్పన ఎక్కువగా ఉండే తయారీ లాంటి రంగాలు కూడా, ఇప్పుడు ఉద్యోగాలను సృష్టించడంలో ఇబ్బంది పడుతున్నాయి. అందువల్ల భవిష్యత్తులో కొత్తగా పనివయస్సుకు చేరే వారికి ఉద్యోగావకాశాలు కల్పించాలంటే ఏటా 80-90 లక్షల ఉద్యోగాలను సృష్టించాల్సిన అవసరం ఉంద'ని వాళ్లు తెలిపారు. ఆర్థిక వ్యవస్థ వృద్ధికి, ఉద్యోగాల సృష్టికి మధ్య అంతరం పెరుగుతుండటం ఆందోళనకర పరిణామమని వాళ్లు అభిప్రాయపడ్డారు. వ్యాపార సంస్థలు, ఎంఎస్‌ఎమ్‌ఈలు, యాజమాన్యాలు లాంటి ఉద్యోగ సృష్టికర్తలను బలోపేతం చేయడమే హండ్రెడ్ మిలియన్ జాబ్స్ కార్యక్రమం ఉద్దేశమని హరీశ్ మెహతా తెలిపారు. వ్యాపారదక్షతా సామర్థ్యం, నైపుణ్యాభివృద్ధి, ఉద్యోగ ప్రోత్సాహక సంస్థల అభివృద్ధి తదితరాలపై ఇది దృష్టి పెడుతుందని అన్నారు. ఇన్ఫోసిస్ సహ వ్యవస్థాపకులు ఎన్.ఆర్.నారాయణమూర్తి, నీతి ఆయోగ్ మాజీ వైస్ ఛైర్మన్ రాజీవ్‌కుమార్ లాంటివాళ్లు దీనికి సహకరించనున్నారు.

# భారత కంపెనీలకు పోటీతత్వమే కీలకం!



అయిదు రోజుల పాటు దావోస్ జరిగే ప్రపంచ ఆర్థిక వేదిక (డబ్ల్యూఈఎఫ్) వార్షిక సమావేశాలకు భారత్ నుంచి వ్యాపార ప్రముఖులు హాజరు కానున్నారు. కంపెనీలకు ఖర్చు, స్థాయి, సామర్థ్యాల్లో పోటీతత్వాన్ని తీసుకురావడమే కీలకంగా మారిందని కన్సల్టెన్సీ సంస్థ బీసీజీ ఇండియా అధిపతి రాహుల్ జైన్ తెలిపారు. 2030 నాటికి ప్రపంచంలో మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా భారత్ నిలిచే అవకాశం ఉందన్నారు. డబ్ల్యూఈఎఫ్ సమావేశాల్లో భారత్‌కు సంబంధించి ఇది కీలకమైన చర్చనీయాంశం కానుంది. '2028 నాటికే ఈ మైలురాయిని చేరుకోవడానికి వృద్ధిని మరింత వేగవంతం చేయొచ్చా అనేది ముఖ్యమైన ప్రశ్న. ఇందుకోసం ప్రస్తుతం జీడీపీలో 15-17 శాతంగా ఉన్న తయారీ రంగాన్ని, 20% లేదా అంతకంటే ఎక్కువకు తీసుకువెళ్లాల్సి ఉంటుంది. ఇదే జరిగితే ఈ లక్ష్యాన్ని సాధించడం ఎప్పుడూ అనే ప్రస్తావన ఉండదు' అని జైన్ పేర్కొన్నారు. శుద్ధ ఇంధనం, ఎలక్ట్రానిక్స్, సెమీకండక్టర్లు వంటి వర్ధమాన రంగాల్లో పెట్టుబడులతో భారత్‌లో కొత్త వృద్ధి అవకాశాలు సృష్టించొచ్చని జైన్ వెల్లడించారు. ఎలక్ట్రానిక్స్, వాహన విడిభాగాలు, పునరుత్పాదక ఇంధన, హార్డ్‌వేర్, డేటా కేంద్రాలు, సెమీకండక్టర్ వ్యవస్థలను విస్తరించడం ద్వారా అంతర్జాతీయ సరఫరా వ్యవస్థలో భారత్ మరింత చొచ్చుకువెళ్లొచ్చని అంచనా వేశారు.

# సినిమా..

## 'కిల్' రాఘవ.. నాని ది ప్యారడైజ్‌పై సూపర్ హైప్





టాలీవుడ్ న్యాచురల్ స్టార్ నాని దసరా ఫేం శ్రీకాంత్ ఓదెల డైరెక్షన్‌లో నటిస్తోన్న చిత్రం ది ప్యారడైజ్. ఈ చిత్రంలో మోహన్ బాబు కీలక పాత్రలో నటిస్తుండగా.. ఇటీవలే విడుదల చేసిన లుక్ నెట్టింట టాక్ ఆఫ్‌దిటౌన్‌గా నిలుస్తోంది. ఈ మూవీని ఎస్ఎల్‌వీ సినిమాస్ బ్యానర్‌లో దసరా ఫేం సుధాకర్ చెరుకూరి తెరకెక్కిస్తున్నారు. షూటింగ్ దశలో ఉన్న ఈ సినిమాకు సంబంధించి ఆసక్తికర వార్త నెట్టింట హల్ చల్ చేస్తోంది. కిల్ యాక్టర్ రాఘవ ఈ సినిమాలో కనిపించబోతున్నాడు. ది ప్యారడైజ్‌లో భాగం కావడం పట్ల ఎక్జయిటింగ్‌కు లోనవుతున్నాడు రాఘవ. శ్రీకాంత్ ఓదెల రాఘవతో స్క్రిప్ట్ డిస్కషన్స్‌లో పాల్గొన్నాడని ఫిలింనగర్ సర్కిల్ సమాచారం. ఈసందర్భంగా శ్రీకాంత్ ఓదెల–రాఘవ కలిసి దిగిన ఫొటో ఒకటినెట్టింట ట్రెండింగ్ అవుతోంది. తాజా టాక్ ప్రకారం త్వరలోనే రాఘవ పోర్షన్‌కు సంబంధించిన సన్నివేశాలను షూట్‌చేయబోతున్నారట. ది ప్యారడైజ్ పాన్ ఇండియా సినిమా కాదని.. పాన్ వరల్డ్ ప్రాజెక్ట్ అని అంటున్నాడు రాఘవ. ఈ చిత్రాన్ని 2026 మార్చి26న ప్రధాన భారతీయ భాషలతోపాటు ఇంగ్లీష్, స్పానిష్ భాషల్లో గ్రాండ్‌గా విడుదల చేసేందుకు రెడీ అవుతున్నారు మేకర్స్.

## మరోసారి హాట్ టాపిక్‌గా మహేష్ బాబు-రాజమౌళి మూవీ




సూపర్ స్టార్ మహేష్ బాబు కథానాయకుడిగా, భారత దర్శక దిగ్గజం ఎస్ఎస్ రాజమౌళి దర్శకత్వంలో తెరకెక్కుతున్న పాన్ వరల్డ్ "గ్లోబ్ ట్రాటింగ్ అడ్వెంచర్ ఫిల్మ్" ఇప్పుడు మరోసారి హాట్ టాపిక్‌గా మారింది. ఈ సినిమా షూటింగ్ ప్రారంభమైనప్పటికీ, అధికారిక అప్డేట్స్ ఏవీ రాకపోవడంతో ఫ్యాన్స్ కాస్త నిరాశగానే ఉన్నారు. అయితే ఈ భారీ ప్రాజెక్ట్‌కు సంబంధించిన ఓ క్రేజీ లీక్ ఇప్పుడు వైరల్ అవుతోంది. ఇండస్ట్రీలో వినిపిస్తున్న సమాచారం ప్రకారం, మహేష్ – రాజమౌళి సినిమా టైటిల్‌గా 'వారణాసి' అనే పేరును పరిశీలిస్తున్నట్లు చెబుతున్నారు. ఇండియన్ మైథాలజీ, యాత్రల నేపథ్యంలో నిర్మించబోతున్న ఈ సినిమాపేరుగా ఈ టైటిల్ ఒక మంచి ఎంపికగా చర్చకు వస్తోంది. వారణాసి అనే నగరం భారతీయ సంస్కృతికి ప్రతీకగా నిలుస్తోంది. అంతర్జాతీయంగా కూడా ఆధ్యాత్మికతకు చిహ్నంగా గుర్తింపు పొందిన ఈ నగరం పేరు టైటిల్‌గా ఉండటం సినిమాకు ప్రత్యేకమైన పాన్ వరల్డ్ కనెక్షన్‌ని తీసుకువస్తుందని భావిస్తున్నారు. ఇక హాలీవుడ్ లెజెండరీ దర్శకుడు జేమ్స్ కామెరూన్ నవంబర్‌లో భారత్‌కు రానున్నారు. "అవతార్: ద ఫైర్ అండ్ యాష్" ప్రమోషన్‌లో భాగంగా భారత పర్యటనకు వస్తున్న కామెరూన్ చేతుల మీదుగా మహేష్ – రాజమౌళి మూవీ టైటిల్‌ను రివీల్ చేయించాలని జక్కన్న ప్రణాళిక వేస్తున్నట్లు సమాచారం. ఇలా చేయడం వల్ల ఈ సినిమా హైప్ మరింత పెరగనుంది. ఈ గ్రాండ్ మూవీలో గ్లోబల్ స్టార్ ప్రియాంక చోప్రా కథానాయికగా నటించనుండగా, పాన్ ఇండియా గుర్తింపు తెచ్చుకున్న ఆర్. మాధవన్, పృథ్వీరాజ్ సుకుమారన్ కీలక పాత్రలు పోషిస్తున్నారు. కథను బట్టి ప్రపంచవ్యాప్తంగా షూటింగ్ జరిపేందుకు ప్రణాళికలు వేస్తున్న జక్కన్న, ఈ సినిమాను ఓ విజువల్ ఎక్స్‌పీరియెన్స్‌గా మలచనున్నారు.దుర్గ ఆర్ట్స్ పతాకంపై కేఎల్ నారాయణ ఈ భారీ బడ్జెట్ ప్రాజెక్ట్‌ను నిర్మిస్తున్నారు. ఆస్కార్ విన్నర్ ఎంఎం కీరవాణి ఈ సినిమాకు సంగీతం అందించనుండగా, టెక్నికల్ టీమ్ అంతా ఇంటర్నేషనల్ లెవెల్‌లో ఉండనుంది. 'ఆర్ఆర్ఆర్' తర్వాత రాజమౌళి తెరకెక్కించనున్న ఈ చిత్రం ప్రపంచ సినిమా స్థాయిలో పెద్ద బ్లాక్‌బస్టర్ అవుతుందనే అంచనాలు ఇప్పటికే ఏర్పడ్డాయి.

## వారణాసిలో మ్యూజిక్ అదుర్స్




ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా ట్రెండింగ్‌లో ఉన్న సినిమా 'వారణాసి'. రాజమౌళి దర్శకత్వంలో మహేశ్ బాబు హీరోగా తెరకెక్కుతోన్న ఈ యాక్షన్ అడ్వెంచర్ మూవీకి సంబంధించిన ప్రతి వార్త క్షణాల్లో వైరల్ అవుతోంది. ప్రజలు కూడా ఈ మూవీపై క్యూరియసిటీతో ఉన్నారు. తాజాగా చిత్ర సంగీత దర్శకుడు కీరవాణి ఈ సినిమాపై మ్యూజికల్ అప్‌డేట్ ఇచ్చారు. గోవా వేదికగా జరుగుతోన్న ఇంటర్నే షనల్ ఫిల్మ్ ఫెస్టివల్ ఆఫ్ ఇండియా (ఇఫి) వేడుకలకు హాజరైన కీరవాణి.. 'వారణాసి'లో సంగీతం ఎవరూ ఊహించని స్థాయిలో ఉంటుందన్నారు. 'అభిమానులు ఈ చిత్రంలో అద్భుతమైన సంగీతా న్ని వింటారు. అంతకు మించి ఇప్పుడే ఈ ప్రాజెక్ట్ గురించి ఏం చెప్పలేను. 'వారణాసి'లో మొత్తం ఆరు పాటలు ఉంటాయి. మనం చేసేపని ఏదైనా కానీ.. దానిపై మనకు స్పష్టత, మనపై మనకు నమ్మకం ఉంటే ఏవిషయమూ గందరగోళంగా అనిపించదు. ఒత్తిడి గాకూడా ఉండదు. నాకుఈ ప్రాజెక్ట్ విషయంలో ఎటువంటి గందర గోళంలేదని చెప్పారు. ఇప్పటికే ఈ సినిమాలో 'రణ కుంభ' ఆడియో సాంగ్ ప్రేక్షకులను ఆకట్టుకుంటూ యూట్యూబ్‌లో ట్రెండ్ సృష్టిస్తోంది. రాజమౌళి తెరకెక్కించే సినిమాలకు ఆయన సోదరుడు కీరవాణి సంగీతం అందిస్తారు. గతంలో వీరిద్దరి కాంబోలో వచ్చిన 'స్టూడెంట్ నెం.1', 'యమదొంగ', 'మగధీర', 'ఈగ','బాహుబలి'లోని పాటలు నేటికీ సోషల్‌మీడియా రీల్స్‌లో వైరల్ అవుతూనే ఉన్నాయి.

## కమిటీ కుర్రోళ్లు కాంబో మళ్లీ రిపీట్..




గత ఏడాది చిన్న సినిమాగా విడుదలై అంచనాలు మించి భారీ విజయాన్ని సాధించిన 'కమిటీ కుర్రోళ్లు' సినిమా కాంబో మళ్లీ రిపీట్ కానుందన్న వార్త ఇప్పుడు సినీ వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారింది. ప్రేక్షకులతో బాగా కనెక్ట్ అయ్యేలా తెరకెక్కిన ఆ చిత్రానికి దర్శకత్వం వహించిన యంగ్ టాలెంటెడ్ డైరెక్టర్ యదు వంశీ , నిర్మాత నిహారిక కొణిదెల మళ్లీ కలిసి కొత్త ప్రాజెక్ట్ కోసం చర్చలు జరుపుతున్నారని సమాచారం. విశ్వసనీయ వర్గాల ప్రకారం, ఈ కొత్త సినిమా 2026 లో సెట్స్‌పైకి వెళ్లే అవకాశంఉంది. పింక్‌ఎలిఫెంట్ పిక్చర్స్ బ్యానర్‌పై ఈ సినిమా తెరకెక్కనుంది. 'కమిటీ కుర్రోళ్లు' విజయం తర్వాత ఈ కాంబినేషన్ మళ్లీ రిపీట్ అవుతుండటంతో ఇండస్ట్రీలో ఆసక్తి నెలకొంది. 'కమిటీ కుర్రోళ్లు' సినిమాకు అనేక ప్రత్యేకతలు ఉన్నాయి. ఈ సినిమాతో 11మంది హీరోలు, 4గురు హీరోయిన్‌లు తెలుగు తెరకు పరిచయం అయ్యారు. రూ.9 కోట్ల బడ్జెట్‌తో తెరకెక్కిన ఈ సినిమా రూ.18.5 కోట్లు థియేట్రికల్ వసూళ్లు, రూ.6 కోట్లు నాన్ థియేట్రికల్ బిజినెస్ సాధించిమొత్తం రూ.24.5కోట్లు రాబట్టి సెన్సే షన్ సృష్టించింది. అవార్డుల రేసులో కూడా 'కమిటీ కుర్రోళ్లు' దుమ్ము రేపింది. సైమా 2025లో ఈ చిత్రం ఘన విజయం సాధించింది.

బెస్ట్ డెబ్యూ ప్రొడ్యూసర్‌గా నిహారిక కొణిదెల, బెస్ట్ డెబ్యూ యాక్టర్‌గా సందీప్ సరోజ్ అవార్డ్ అందుకున్నారు. అలాగే తెలంగాణ ప్రభుత్వం ప్రకటిం చిన గద్దర్ అవార్డుల్లో కూడా రెండు ప్రతిష్ఠాత్మక పురస్కారాలను దక్కించుకుంది. జాతీయ సమైక్యత,

మత సామరస్యం, అణగారిన వర్గాల అభ్యున్నతిపై తీసిన ఉత్తమ ఫీచర్ ఫిల్మ్ అవార్డుతో పాటు ఉత్తమ డెబ్యూ డైరెక్టర్ అవార్డు యదు వంశీ దక్కించుకున్నాడు. ఇక ప్రస్తుతం పింక్ ఎలిఫెంట్ పిక్చర్స్ బ్యానర్‌పై ప్రొడక్షన్ నెం.2 గా మరో ప్రాజెక్ట్ ఇటీవలే ప్రారంభమైంది. ఈ చిత్రానికి మానస శర్మ దర్శకత్వం వహిస్తున్నారు.

## మా నిలయం.. ఓ గ్రంథాలయం





చాలామంది రిటైర్ అయ్యాక విశ్రాంతిని కోరుకుంటారు. కానీ, రిటైర్డ్‌లైఫ్‌ను సమాజానికి అంకితం చేశారు ఈ దంపతులు. ప్రభుత్వ ఉద్యోగానికి సిద్ధమవుతున్న గ్రామీణ యువత కోసం తమ నివాసాన్నే గ్రంథాలయంగా మార్చారు. నిరుద్యోగులకు బతుకుబాట చూపుతున్నారు. వారే ఖమ్మం పట్టణానికి చెందిన చావా దుర్గాభవాని, పారుపల్లి అజయ్‌కుమార్ దంపతులు. రూ.20 లక్షలు వెచ్చించి గ్రంథాలయం ఏర్పాటు చేసి, ఎలాంటి ప్రతిఫలం ఆశించకుండా ఉద్యోగార్థులకు చుక్కానిగా నిలుస్తున్న ఈ దంపతులను జిందగీ పలకరించింది. ఆ విశేషాలే ఇవి.. తమ తండ్రులు ఇద్దరూ ప్రభుత్వ ఉపాధ్యాయులు కావడంతో వాళ్ల ప్రభావం ఈ ఇద్దరిపై పడింది. ఆ స్ఫూర్తితోనే టీచరు కొలువులు సాధించారు. అందుకే వారి జ్ఞాపకార్థంగా వారి పేర్లను తమ గ్రంథాలయానికి పెట్టుకున్నారు.పెద్ద రీడింగ్ హాల్‌కు అజయ్ కుమార్ తండ్రి పేరుతో 'పారుపల్లిసత్యనారాయణ పుస్తక పూదోట' అని,మినీ రీడింగ్ హాల్‌కు దుర్గా భవాని తండ్రి పేరైన 'చావా రామారావు' అని పేరు పెట్టి విజ్ఞానాన్ని అందిస్తున్నారు. పోటీపరీక్షలతోపాటు సాహితీ ప్రియుల కోసం వివిధ భాషలకు చెందిన గ్రంథాలను ఇక్కడ పొందుపరిచారు.'ఇద్దరం గొప్పగా చదువుకున్నాం. మంచి ఉదోగ్యాల్లో స్థిరపడ్డాం! ఇక సమాజంతో మనకేంటి పని' అని ఏనాడూ అనుకోలేదు ఆ దంప తులు. ఉన్నతమైన ఉపాధ్యాయ వృత్తిని చేపట్టి.. సమాజ నిర్మాణంలో తమవంతు పాత్ర పోషించారు అజయ్, దుర్గాభవాని. పదవీ విరమణ తర్వాత కూడా అదే లక్ష్యంతో ముందుకుసాగుతున్నారు. ఖమ్మం జిల్లాకు చెందిన చావా దుర్గా భవానికి చదువంటే ఇష్టం. ఆమె తండ్రి ఉపాధ్యాయుడు కావడంతో కూతురును చక్కగా ప్రోత్సహిం చాడు. అలా కష్టపడి 1997లో ప్రభుత్వ ఉపాధ్యాయురాలిగా కొలువు సాధించింది. అదే జిల్లాకు చెందిన పారుపల్లి అజయ్‌కుమార్ కూడా చదువులో మొదట్నుంచీ చురుకే! ఇంటర్ కాగానే టీటీసీ పూర్తిచేశారు. 1986లో ఎస్‌జీటీ టీచర్‌గా తన ప్రస్థానాన్ని మొదలు పెట్టారు. అజయ్, దుర్గ బంధువులు కావడంతో ఇద్దరికీ పెద్దలు పెండ్లి నిశ్చయం చేశారు.

అజయ్ ఉద్యోగం చేస్తూనే ఉన్నత చదువులు చదివి జూనియర్ కాలేజీ అధ్యాపకుడిగా పదోన్నతి పొందారు. అధ్యాపకుడిగా రిటైర్ అయ్యారు. తండ్రి ఉపాధ్యాయ వృత్తి చేస్తున్నా.. దుర్గాభవాని బాల్యంలో ఆటుపోట్లకు కొదువ లేదు. 'బతకలేక బడిపంతులు' అనే ఆ రోజుల్లో.. వాళ్ల కుటుంబానికి ఆర్థిక ఇబ్బందులు తరచూ సవాళ్లు విసిరేవి. కొత్త పుస్తకాలు కొనాలన్నా జేబులు తడుముకోవాల్సిన పరిస్థితులు ఉండేవి. సెకండ్ హ్యాండ్ పుస్తకాలు కొని చదువు వెళ్లదీసింది దుర్గా భవాని. మరోవైపు చిన్నప్పుడు అజయ్ కుమార్ పరిస్థితీ దాదాపు ఇంతే! ఇద్దరూ కష్టాలు చూసి పెరిగిన వాళ్లు కావడంతో, వృత్తిలో స్థిరపడిన తర్వాత కష్టాల్లో ఉన్న ఇతరులను ఆదుకోవడం తమ బాధ్యతగా భావించారు. ఉప్పు, పప్పు దానం చేసి గొప్పకు పోలేదు వాళ్లు. విద్యార్థులకు అండగా నిలిచారు. ఆర్థిక స్థోమత లేని విద్యార్థులకు, ఉద్యోగాన్వేషణలో ఉన్న యువతకు అండగా నిలవాలని భావించారు.

**రూ.20 లక్షలు వెచ్చించి..:** కుటుంబ బాధ్యతలు ఎన్ని ఉన్నా.. ఉన్నంతలో నలుగురికి సాయం చేస్తూ వచ్చారు. రిటైర్ అయ్యాక కూడా పనిచేస్తూనే ఉండాలనే ఆలోచన అజయ్‌ది. తాను రిటైర్ అవ్వగానే భార్యతో 'ఇకనుంచి ఈసామాజానికి మరింత సేవ చేయాలనుంది' అని తన మనసులో మాట చెప్పారు. అందుకు ఆమె కూడా అంగీకరించింది. ఇద్దరూ ఒక్కటిగా ఆలోచించి.. తమలాగా కష్టపడి చదివి ఉద్యోగాలు సాధించాలనే వారికి చే యుతనివ్వాలని నిర్ణయానికి వచ్చారు. పదిమందికి డబ్బులివ్వడం తోనో, నాలుగు పుస్తకాలు కొనివ్వడంతోనో తమ బాధ్యత పూర్తవు తుందని అనుకోలేదు.తమ ఇంటినే గ్రంథాలయంగా మార్చారు. ఉద్యోగార్థులు, విద్యార్థులు తమ ఇంటికి వచ్చి కావాల్సినవి చదువుకునేలా ఏర్పాటు చేశారు. అలా వికసించిన విద్యావనమే 'పారుపల్లి సత్యనారాయణ పుస్తక పూదోట'. తమ ఇంట్లోని మొదటి అంతస్తు మొత్తాన్ని గ్రంథాలయంగా మార్చేశారు. రూ.20 లక్షలు వెచ్చించి.. మౌలిక వసతులు కల్పించడంతోపాటు పుస్తకాలు సమకూర్చారు.

అలా 2019లో గ్రంథాలయాన్ని ప్రారంభించారు. ప్రతి రోజూ ఉదయం ఆరు గంటల నుంచి రాత్రి పది గంటల వరకు ఇది అందరికీ అందుబాటులో ఉంటుంది. లైబ్రరీ నిర్వహణ, కొత్త పుస్తకాలు తీసుకురావడం ఇవన్నీ అజయ్‌కుమార్ పనులు. యువతకు ఉద్యోగ నోటిఫికేషన్ల వివరాలు తెలియపరచడం, సిలబస్ వివరించ డం దుర్గాభవాని కర్తవ్యం. ఇలా ఇద్దరూ కలిసి తమ ఇంటిలో 8000కు పైగా పుస్తకాలను అందుబాటులో ఉంచి.. నిరుద్యోగులకు బాసటగా నిలుస్తున్నారు.

**ఎందరికో కొలువులు:** ఖమ్మం చుట్టుపక్కల గ్రామాల నుంచి పోటీపరీక్షలకు సిద్ధమయ్యే వారికి ఈ గ్రంథాలయం ఓ దేవాలయంతో సమానం. వేలకు వేలు కట్టి కోచింగ్ తీసుకోలేని వారికి ఉచితంగా పుస్తకాలిచ్చి ఉద్యోగం వచ్చేవరకు చదివిస్తున్నారు వీళ్లు. దూరప్రాంతాలకు చెందినవాళ్లు సైతం టౌన్‌లోనే రూమ్ అద్దెకు తీసుకొని నిత్యం ఈ గ్రంథాలయానికి వచ్చి తమ ప్రిపరేషన్ కొనసాగిస్తున్నారు. ప్రారంభించిన నాటి నుంచి ఇప్పటివరకు ఇక్కడ చదువుకున్నవాళ్లలో 15 మంది పోలీసు ఉద్యోగాలు, 25 మంది టీచర్ కొలువులు సాధించడంతోపాటు పలువురు నేవీ, ఆర్మీ, రైల్వే లాంటి కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాలు సాధించారు. గ్రంథాలయ నిర్వహణకు గానూ ప్రతి నెలా రూ.25 వేలకుపైగా సొంత నిధులు ఖర్చుచేస్తున్నారు అజయ్, దుర్గాభవాని దంపతులు.

భవిష్యత్తులో మరిన్ని సేవలు..:

ప్రతిపనిలో కూడా జవాబుదారీగా ఉండాలనే ఆలోచనతో వాళ్ల సన్నిహితులతో కమిటీ ఒకటి వేసుకున్నారు. ఇక్కడ చదువుకొని ఉద్యోగాలు సాధించిన వాళ్లు ఎంతో కొంత డొనేషన్ రూపంలో పంపుతుంటారు. ఆ డబ్బుతో పుస్తకాలు కొంటుంటారు. ప్రస్తుతం దుర్గాభవాని ఖమ్మం పట్టణంలోనే ప్రభుత్వ పాఠశాలలో ప్రధాన ఉపాధ్యాయురాలిగా పనిచేస్తున్నారు. లైబ్రరీ నిర్వహణలో ఇద్దరూ తలమునకలుగా ఉంటారు. భవిష్యత్తులో గ్రంథాలయాన్ని మరింత అభివృద్ధి పరచాలని భావిస్తున్నారు. ఫ్యాకల్టీని ఏర్పాటు చేసి ఉద్యోగార్థులకు ఉచిత తరగతులు నిర్వహించాలనే తలంపుతో ఉన్నారు. సర్కారు కొలువు సాధించడానికి గ్రామీణ విద్యార్థులకు తోడ్పాటు అందివ్వడమే తమ లక్ష్యం అని చెబుతున్న అజయ్, దుర్గాభవాని దంపతులకు మనమూ హ్యాట్సాఫ్ చెబుదాం!



Published, printed and Owned by Merugu Chandra Mohan Printed at Sahaja publications, H.No. 3-455, Journalist Colony, Dammaiguda, Nagaram, Keesara, Medchal Malkajgiri District, Telangana.
Published from H.No. 3-455, Journalist Colony, Dammaiguda, Nagaram, Keesara, Medchal Malkajgiri District, Telangana. RNI. NO: TELTEL/2023/88215